PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 101 | విజయవాడ, శనివారం 12 నవంబర్ 2022 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 12 November 2022 | Rs

సిపిఎస్ రద్దు చేయాలి

- ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు వినతి

లోపలి పేజీలో..

జనవరి 8 నుంచి గ్రూప్-1 ప్రిలిమ్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-1 పోస్టుల ప్రిలిమ్స్ పరీక్షల షెడ్యూల్‌ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) వాయిదా వేసింది. జనవరి 8వ తేదీ నుంచి ఈ పరీక్షలు జరుగుతాయని ఎపిపిఎస్‌సి కార్యదర్శి అరుణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 18వ తేదీ నుంచి ప్రిలిమ్స్ జరగాల్సి ఉంది. పరిపాలనా కారణాల రీత్యా ఈ పరీక్షలను జనవరి 8వ తేదీకి కమిషన్ వాయిదా వేసింది. మొత్తం 92 పోస్టులకు సెప్టెంబర్ 30న ఎపిపిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది.

APPSC

విశాఖలో మోడీ

స్వాగతం పలికిన గవర్నర్, సిఎం



ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న గవర్నర్ విశ్వభూషణ్, సిఎం జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం విశాఖపట్నానికి చేరుకున్నారు. మధురైలో వర్షం కారణంగా అరగంట ఆలస్యంగా రాత్రి 8.04 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయనకు బిజెపి నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎయిర్ పోర్టు నుంచి ఐఎన్ఎస్ చోళాకు వెళ్లారు. దారిలో తన వాహనం నుంచే ప్రజలకు అభివాదం చేశారు. అక్కడ మోడీకి రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వెంట స్పీకర్ తమ్మినేని సీతారాం, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, తూర్పునౌకాదళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ బిశ్వజిత్ దాస్ గుప్తా, డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, జెడ్‌పి చైర్‌పర్సన్ జె.సుభద్ర ఉన్నారు. శనివారం ఉదయం పది గంటలకు ఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించనున్నారు.

ప్రత్యేక పరిస్థితుల్లో భేటీ : పవన్

ఐఎన్ఎస్ చోళాలో ప్రధాని మోడీతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. అనంతరం విశాఖ నోవాటల్‌లో రాత్రి 9.45 గంటలకు మీడియాతో పవన్ మాట్లాడారు. ప్రధానితో 8 సంవత్సరాలు తర్వాత సమావేశమైనట్లు ఆయన చెప్పారు. ఇది ప్రత్యేక పరిస్థితుల్లో జరిగిన భేటీ అని ఆయన పేర్కొన్నారు. దాదాపు అరగంట పాటు సాగిన ఈ సమావేశం అనంతరం పవన్ మీడియాతో మాట్లాడుతూ తెలుగు ప్రజలు అభివృద్ధి చెందాలనేది ప్రధాని ఆకాంక్ష అని చెప్పారు. 'ప్రత్యేక పరిస్థితుల్లో ఈ భేటీ జరిగింది. సమావేశంలో అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారని, తన అవగాహన మేరకు వివరాలు తెలియజేశానన్నారు. ఈ సమావేశం ఎపికి మంచి రోజులు తీసుకొస్తాయని, మంచి రోజులు తీసుకొస్తానని గాఢంగా నమ్ముతున్నట్లు పవన్ తెలిపారు.


పోర్టు హార్బర్ గెస్ట్‌హౌస్‌లో జగన్ బస

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పిఎంను కలిశాక విశాఖలోని పోర్టు హార్బర్ గెస్ట్‌హౌస్‌కు రాత్రి 9 గంటలకు చేరుకున్నారు. రాత్రికి అక్కడే బస చేశారు. శనివారం ఉదయం 9.30 గంటలకు ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో ప్రధాని మోడీ... రాష్ట్రానికి, విశాఖకు చెందిన రూ.15,233 కోట్ల విలువైన ఐదు పథకాలకు శంకుస్థాపన, ఆరు పథకాలకు ప్రారంభోత్సవ చేయనున్నారు. ఆ తర్వాత ఎయు మైదానంలో జరిగే సభలో ప్రధాని మోడీ, సిఎం వైఎస్ జగన్ ప్రసంగించనున్నారు.

దీక్షా శిబిరంలోని మహిళలను అరెస్టు చేస్తున్న పోలీసులు



ఉక్కు పరిరక్షణ కమిటీ కన్వీనర్ అయోధ్యరామ్ అరెస్టు



'ఉక్కు' శిబిరంపై దాడి

మోడీ పర్యటన నేపథ్యంలో విరుచుకుపడిన రాష్ట్ర ప్రభుత్వం

కార్మికుల అరెస్ట్.. రాష్ట్రవ్యాప్త నిరసనలు

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఉక్కు కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం విరుచుకుపడింది. గతంలో ఈ పోరాటానికి మద్దతు తెలిపి, రాష్ట్ర అసెంబ్లీలోనూ తీర్మానం చేసిన ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటన నేపథ్యంలో శుక్రవారం ఉక్కు దీక్షా శిబిరంపై పోలీసు బలగాలను ప్రయోగించింది. పైనుండి అందిన ఆదేశాలతో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం జంక్షన్లో 638 రోజులుగా జరుగుతున్న దీక్షా శిబిరంపై ప్రధాని పర్యటనకు కొన్ని గంటల ముందు పోలీసులు దాడి చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా జరిగిన ఈ దాడితో శిబిరం వద్ద ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆంధ్రుల హక్కు..విశాఖ ఉక్కు నినాదాలు మారుమ్రోగాయి. కార్మికులను, నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు 20 కి.మీ దూరంలోని సబ్బవరం, పెందుర్తి పోలీసు స్టేషన్లకు తరలించారు. అంతకుముందు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, విభజన హామీల అమలు, రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. విశాఖ పర్యటనలోనే ప్రధాని వీటిపై ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ నిరసనల్లో భాగస్వాములయ్యారు.

మరోవైపు కార్మికులు, వారి కుటుంబసభ్యులు, స్టీల్ ప్లాంట్ నిర్వాసితులు నల్లబ్యాడ్జీలతో శుక్రవారం ఉదయమే దీక్షా శిబిరానికి చేరుకున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మబోమని ఈ నెల 12న జరిగే బహిరంగ సభలో ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలంటూ నినాదాలు చేశారు. ప్రశాంతంగా సాగుతున్న శిబిరం వద్దకు వచ్చిన పోలీసులు దీక్షా శిబిరాన్ని వెంటనే ఖాళీ చేయాలని, లేకుంటే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. అయినా, కార్మికులు బెదరకుండా దీక్షా శిబిరంలోనే ఉన్నారు. దీంతో, పోలీసులు రెచ్చిపోయారు. దొరికిన వారిని దొరికినట్టు ఈడ్చుకెళ్లి అరెస్టు చేసి వ్యాన్లలో ఎక్కించి పోలీస్ స్టేషన్లకు తరలించారు. దీక్షలకు వైసిపి ప్రభుత్వం మద్దతు ఇస్తోన్నా తమను ఎందుకు అరెస్టు చేస్తున్నారో సమాధానం చెప్పాలని కార్మికులు ప్రశ్నించారు. 'సేవ్ వైజాగ్ స్టీల్' అంటూ నినాదాలను హోరెత్తించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ మిగతా 2లో

అరెస్టు సిగ్గుచేటు

- రాష్ట్ర ప్రభుత్వ రెండు నాల్కల ధోరణి
- సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండన

లోపలి పేజీలో..

17 గ్రామాల్లోనూ గ్రామసభలు

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని పరిధిలోని 17 గ్రామాల్లోనూ రెండు రోజుల్లో గ్రామసభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రాజధాని అమరావతిలో గ్రామసభలు నిర్వహించకుండానే స్థానికేతరులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు అభ్యంతర పత్రాలు అడుగుతున్నారని రైతులు వేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. రాజధాని అమరావతికి రైతులు ఇచ్చిన భూముల్లో రాజధానేతర ప్రాంత ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిఆర్‌డిఎ సవరణ చట్టం (యాక్ట్ 13) తీసుకొచ్చింది. రెసిడెన్షియల్ జోన్-5లో మాస్టర్ ప్లాన్‌లో సవరణలు తీసుకొచ్చేందుకు గెజిట్ ప్రకటన విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణకు ఆయా గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు ప్రకటన జారీ చేశారు. ఆ ప్రకటనలను సవాలు చేస్తూ మందడం, లింగాయపాలెం గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్, ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని సిఆర్‌డిఎ కమిషనర్, పంచాయతీల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. సిఆర్‌డిఎ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం పాటించలేదని శుక్రవారం విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రాజధాని ప్రాంతంలో ఉన్న పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన తరువాతే మిగిలిన అంశాలు చూడాలని రైతుల తరపు న్యాయవాది తెలిపారు. గ్రామసభలు నిర్వహించకుండా అభ్యంతర పత్రాలు అడుగుతున్నారని, వ్యక్తిగతంగా నోటీసులు జారీ చేస్తున్నారని ధర్మాసనానికి తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం కచ్చితంగా రెండు రోజుల్లో 17 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

అమరావతి భూములపై దర్యాప్తు

- రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు అంగీకారం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని నిర్మాణం కోసం గత టిడిపి ప్రభుత్వ హయంలో అమరావతి భూసమీకరణ అక్రమాలపై దర్యాప్తు జరిపేందుకు అనుమతించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం నాడు విచారణ చేపట్టింది. అమరావతి భూముల వ్యవహారంపై దర్యాప్తు జరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయగా..దానిపై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. దీనిని సవాలు చేస్తూ గత ప్రభుత్వ నిర్ణయాలపై దర్యాప్తునకు అనుమతించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై శుక్రవారం నాడు విచారణ చేపట్టిన జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై లోతుగా విచారణ చేపడుతామని తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 16కు వాయిదా వేసింది.

రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. అమరావతి భూముల వ్యవహారం కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)కి అప్పగించాల్సిన అంశమని ఆయన తెలిపారు. అమరావతి భూములపై పలు నోటిఫికేషన్లు ఇచ్చామని, సిట్ ఏర్పాటు చేశామని, పోలీసు నోటీసులు కూడా ఇచ్చామని అయినప్పటికీ హైకోర్టు మూడు డాక్యుమెంట్లు విస్మరించి సిట్ దర్యాప్తు నిలిపివేసిందన్నారు. ఈ అంశం సిబిఐతో విచారణ చేయించాల్సిన అవసరం ఉందని, రాష్ట్ర ప్రభుత్వానికి ఎగ్జిక్యూటివ్ పవర్ ఉన్నప్పటికీ హైకోర్టు దర్యాప్తునకు అంగీకరించలేదన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలపై దర్యాప్తు చేయాలన్న తాజా ప్రభుత్వ నిర్ణయాల గురించి సుప్రీంకోర్టు గతంలో విచారించిందని తెలిపారు. రాజకీయ కక్షల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి దర్యాప్తు అధికారం లేదని హైకోర్టు అనడం సబబు కాదన్నారు. రాజకీయ కక్షలు ఉన్నప్పటికీ వాస్తవాలు తెలుసుకోవడానికి దర్యాప్తు చేయడం సమంజసమేనని జగన్నాధరావు కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఒక వేళ రాష్ట్ర దర్యాప్తు సంస్థలపై హైకోర్టుకు అనుమానం ఉంటే సిబిఐ దర్యాప్తునకు ఆదేశించవచ్చు కదా అని ఆయన వ్యాఖ్యానించారు. కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సులనే హైకోర్టు తప్పు పట్టిందని, హైకోర్టు ఆదేశాలపై స్టే ఇచ్చి విచారణ కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వ నిర్ణయాలపై ప్రస్తుత ప్రభుత్వం దర్యాప్తు అనేది విస్తృత ప్రయోజనాల కోసమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బుధవారం విచారణ చేపడతామని పేర్కొంది. జాబితాలో టాప్ ఆఫ్ ద బోర్డుగా ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

కాగా ఈ సందర్భంగా కొన్ని డాక్యుమెంట్లు సమర్పిస్తామని ప్రతివాది వర్ల రామయ్య తరపు న్యాయవాది సిద్ధార్థ దవే తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ 'ఇది క్వశ్చన్ ఆఫ్ లాకు సంబంధించిన అంశం. వాస్తవాలు కనిపెట్టే అథారిటీ మాది కాదు. మేమేమీ సిబిఐ, సిట్ కాదు. గత ప్రభుత్వ నిర్ణయాలపై ప్రస్తుత ప్రభుత్వ అధికారాలు ఏమిటనే దానిపైనే విచారణ చేపడుతాం' అని స్పష్టం చేసింది.

జనవరి 27 నుంచి లోకేష్ పాదయాత్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జనవరి 27 నుంచి 400 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టనున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా ఆయన ఈ యాత్ర చేపట్టనున్నారు. పాదయాత్ర చిత్తూరు జిల్లా కుప్పం నియోజక వర్గం నుంచి ప్రారంభించాలా?, అనంతపురం జిల్లా హిందుపూరం నియోజకవర్గం నుంచి ప్రారంభించాలా అని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. రోజుకు 10 కిలోమీటర్ల చొప్పున శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర కొనసాగనుంది. ప్రతి నియోజకవర్గంలో మూడు నుంచి నాలుగు రోజుల పాటు పాదయాత్ర, ఒక బహిరంగ సభకు కసరత్తు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలపై కేంద్రీకరిస్తూ పాదయాత్ర చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ యాత్ర సాగుతుందని చెబుతున్నారు. యాత్రకు సంబంధించి పలు బృందాలను ఏర్పాటు చేయాలని పార్టీ సీనియర్ నాయకులతో చంద్రబాబు ఇప్పటికే చర్చలు జరిపారు.

బాగా చదువుకోవాలి

- మైనార్టీ దినోత్సవ సభలో సిఎం జగన్
- మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి



మౌలానా, వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు నివాళులర్పిస్తున్న సిఎం జగన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ప్రతి ముస్లిం విద్యార్థి ప్రపంచంతో పోటీపడేలా చదువుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాల్లో భాగంగా జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సభలో సిఎం పాల్గొన్నారు. తొలుత మౌలానా అబుల్ కలాం ఆజాద్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మైనార్టీలకు షాదీ దువా పథకంలో పదవ తరగతి విద్యార్హతను తప్పని సరి చేయడం తగదని సభలో పాల్గొన్న పలువురు సిఎం దృష్టికి తీసుకువచ్చారు. సిఎం తన ప్రసంగంలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ విద్యకు దూరమై గతంలో మైనార్టీలు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇప్పుడు బాగా చదువుతున్నారు.. ఇంకా బాగా చదవాలి... ప్రపంచంతో పోటీ పడేలా చదవాలని కోరారు. కనీసం 10వ తరగతి పాసైతే ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదువుతారని చెప్పారు. మైనార్టీలకు ఉర్దూతో పాటు ఇంగ్లీషులో కూడా ప్రావీణ్యత గడించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు కేవలం రూ. 2665 కోట్లు ఖర్చు చేయగా తమ ప్రభుత్వం గత మూడున్నర ఏళ్ల కాలంలో రూ. 20వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. 2,42,000 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను కాపాడతామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 65,743 ఎకరాలు భూముల అన్యాక్రాంతమయ్యాయని గుర్తించామని వీటిలో 580 ఎకరాల మిగతా 2లో



శ్రీ హరన్ (మురుగన్)



నళిని



సంతాన్

అందర్నీ విడుదల చేయండి

రాజీవ్‌గాంధీ హత్య కేసులో సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో మొత్తం ఆరుగురు దోషుల్నీ తక్షణమే విడుదల చేయాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. వారంతా జీవిత ఖైదు శిక్ష పడి 30 ఏళ్లకు పైగా శిక్ష అనుభవిస్తున్నారు. నళిని, రవిచంద్రన్, జయకుమార్, సుధేంధిరరాజా అలియాస్ శాంతన్, మురుగన్, రాబర్ట్ పయాస్‌లను విడుదల చేయాలని ఆదేశించింది. ఈ దోషుల ముందస్తు విడుదలకు 2018 సెప్టెంబర్‌లో గవర్నర్‌కు తమిళనాడు క్యాబినెట్ సిఫార్సు చేసిన విషయాన్ని జస్టిస్ బిఆర్ గవై, జస్టిస్ బివి నాగరత్నలతో కూడిన ధర్మాసనం ప్రస్తావించింది. అలాగే, ఈ కేసులో మూడు దశాబ్దాలకు పైగా జైలు శిక్ష అనుభవించిన దోషి ఎ.జి. పేరరివాళన్‌ను విడుదల చేయాలని ఈ ఏడాది మే 18న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. పేరరివాళన్ విడుదల తరువాత తమను కూడా ముందస్తుగా విడుదల చేయాలని కోరుతూ నళిని, రవిచంద్రన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. పేరరివాళన్ కేసులో తీర్పే వీరికీ వర్తిస్తుందని స్పష్టం చేసింది. నళిని, రవిచంద్రన్‌లతో పాటు మిగతా నలుగుర్ని కూడా విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది. ఇతర కేసుల్లో వీరికి జైలు శిక్ష లేకపోతే వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని స్పష్టం చేసింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తరువాత, కేంద్రం సహా అందరి అభిప్రాయాలను స్వీకరించిన తర్వాతే వీరి విడుదలకు తీర్పు ఇచ్చినట్లు సుప్రీంకోర్టు తెలిపింది. ఈ దోషులంతా శిక్షఅనుభవిస్తూ పిజిలు పూర్తి చేశారని, శాంతన్ కవితలు రాసి జర్మనీలో అవార్డులు కూడా గెలుచుకున్నాడని తెలిపింది. ప్రస్తుతం ఈ ఆరుగురు దోషులు తమిళనాడులోని వేల్లూరు జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో రాజీవ్ గాంధీ హత్యకు గురయ్యారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభ డిమాండ్

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్.రమణరావు, ఆర్.వి.నరసింహారావు

ప్రజాశక్తి-కృష్ణా ప్రతినిధి

కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ఏడో మహాసభ డిమాండ్ చేసింది. కృష్ణా జిల్లా గుడివాడలోని జివిఆర్ కల్యాణ మండపం (దామరపు సుబ్బన్న నగర్)లో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర మహాసభ శుక్రవారం ముగిసింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.ఉమామహేశ్వరావు ప్రవేశపెట్టిన మూడు, రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్.రాజ్‌కుమార్ ప్రవేశపెట్టిన తొమ్మిది తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇతర రాష్ట్రాల్లో ఇస్తోన్న సంక్షేమ బోర్డు పథకాలను రాష్ట్రంలో కూడా అమలు చేయాలని, కార్మికుల మధ్య ఐక్యతను సాధించి మతోన్మాద శక్తులను ఓడించాలని, దేశప్రజల ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టే మానిటైజేషన్ పథకాన్ని రద్దు చేయాలని, సిమెంట్, ఇసుక, ఇనుము, కలప, ఇతర నిర్మాణ సామగ్రి ధరలు తగ్గించాలని,



వి.ఉమామహేశ్వరరావు



ఎన్.రమణరావు



ఆర్.వి.నరసింహారావు

కార్మికులకు ఉపాధి కల్పించాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, అందరికీ సార్వత్రిక పెన్షన్ అమలు చేయాలని, 1214 సర్క్యులర్ మెమోను రద్దు చేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలనీ మహాసభ తీర్మానించింది. విశాఖ స్టీల్ ప్లాంటు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తోన్న నిరసన కార్యక్రమాలపై నిర్బంధాన్ని ఆపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా జరిగే ధర్నా, ఈ నెలలో జరిగే డిమాండ్ల డేలను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిస్తూ తీర్మానించింది. అఖిల భారత కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి, కేరళ బిడిసి సంక్షేమ బోర్డు చైర్మన్ వి.శశికుమార్, సిఐటియు ఆలిండియా కార్యదర్శి ఎం.సాయిబాబ తదితరులు మాట్లాడారు.

56 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పాటు

మహాసభ 56 మందితో నూతన రాష్ట్ర కమిటీని, 16 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా వి.ఉమామహేశ్వరరావు, అధ్యక్షులుగా ఎన్.రమణరావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.వి.నరసింహారావు, కోశాధికారిగా కె.వి.గోపాలరావు, ఉపాధ్యక్షులుగా పి.నరసింహారావు, బి.వెంకటరావు, కాజ, ఎం.సూరి బాబు, కె.సంపూర్ణమ్మ, ఎం.కోటమ్మ, సహాయ కార్యదర్శులుగా ఎ.గోపాల్, ఎం.సుందరబాబు, ఎ.రాజు, వి.బాలవెంకట్, బి.సాంబశివ, పి.అనసూయ, కె.వి.గోపాలరావు ఎన్నికయ్యారు.

వచ్చే వారం బైడెన్, జిన్‌పింగ్ భేటీ

బీజింగ్ : వచ్చే వారం ఇండోనేషియాలోని బాలిలో జరగనున్న జి-20 సదస్సుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఆయన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో సోమవారం భేటీ కానున్నారు. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఈ విషయాన్ని ధ్రువీకరించింది. జిన్‌పింగ్ మూడోసారి చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత బైడెన్‌తో జరుగుతున్న మొదటి ముఖాముఖి సమావేశం ఇదే. గతేడాది జనవరిలో బైడెన్ అధికారం చేపట్టడానికి ముందు వీరిరువురు భేటీ అయ్యారు. నవంబరు 14 నుండి 17వరకు జరిగే ఈ సమావేశాల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, సెనెగల్, అర్జెంటైనా నేతలతో కూడా జిన్‌పింగ్ భేటీ కానున్నారని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఝావో లిజియాన్ తెలిపారు. అనంతరం 17 నుండి 19 వరకు థాయిలాండ్‌లో జరిగిన అపెక్ సదస్సుకు హాజరవుతారు. మరింత మెరుగైన రీతిలో సంబంధాలు వుండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నేతలు చర్చలు జరుపుతారని వైట్‌హౌస్ పేర్కొంది. ఘర్షణ కాదు, పోటీ కోసం ఎదురుచూస్తున్నామని ఇప్పటికే జిన్‌పింగ్‌కు తెలియజేసినట్లు బైడెన్ తెలిపారు. తైవాన్‌పై కూడా చర్చిస్తామని, అయితే, అమెరికా వైఖరి మారేది లేదని చెప్పారు.

రిజర్వేషన్లపై అఫిడవిట్‌ను కేంద్రం ఉపసంహరించుకోవాలి

- కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మతం మారితే దళితులు కూడా ఓబిసిల కిందికే వస్తారని బిజెపి నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడం తగదని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఒ.నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రి పేర్కొన్నారు. దళితుల ఆత్మగౌరవం దెబ్బతినేలా కేంద్రం ఇచ్చిన ఈ అఫిడవిట్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బిజెపి మనువాద సిద్ధాంతాన్ని అమలు పరచడంలో భాగంగానే ఈ అఫిడవిట్‌ను ఇచ్చిందని తెలిపారు. మతం మారినా దళితులు ఇప్పటికీ తీవ్ర వివక్షతను ఎదుర్కొంటున్నారన్నారు. హిందూమతంలో వున్న అణచివేతలను తట్టుకోలేకే దళితులు ఇతర మతాల్లోకి పోతున్నారని పేర్కొన్నారు. క్రైస్తవ, ఇస్లామ్ మతం స్వీకరించిన షెడ్యూల్ తరగతులకు ఎలాంటి ప్రయోజనాలు వర్తింపజేయరాదన్న కుట్రతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. మతంతో సంబంధం లేకుండా దళితులందరికీ రిజర్వేషన్ ఫలాలు అందాలని డిమాండ్ చేశారు. రంగనాథ్ మిశ్రా కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. ఆర్‌ఎస్‌ఎస్ అజెండా ఘర్‌వాపసిని అమలు చేసేందుకే ఈ అఫిడవిట్ అని విమర్శించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

కౌలు రైతు సంఘం నుంచి జమలయ్య బహిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం నుంచి పి.జమలయ్యను బహిష్కరిస్తున్నట్లు ఆ సంఘం పేర్కొంది. శుక్రవారంనాడు వడ్డేశ్వరంలోని ఎపి రైతు కౌలురైతు సంఘం కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. పి జమలయ్య తీవ్రమైన ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు సమావేశం చర్చించి తీర్మానం చేసింది. ఈ సమావేశ తీర్మానం మేరకు జమలయ్యను సంఘంలోని అన్ని బాధ్యతలతోపాటు ప్రాథమిక సభ్యత్వాన్ని కూడా సస్పెండ్ చేసినట్లు ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎంపి హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు ఆపాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయుల అక్రమ సిఫార్సుల బదిలీలను అంగీకరించబోమని, వీటిని వెంటనే నిలిపివేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. 46 మందికి సిఫార్సు బదిలీలు చేస్తున్నట్లు వస్తున్న వార్తలపై ప్రభుత్వం స్పందించాలని ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రమోషన్ల కౌన్సిలింగ్ ముగిసిన వెంటనే బదిలీలు నిర్వహిస్తామని పదేపదే చెప్పిన ప్రభుత్వం, షెడ్యూల్ విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ సిఫార్సు బదిలీలను ముందుకు తీసుకురావడం, ఉపాధ్యాయులు పోరాడి సాధించుకున్న హక్కును కాలరాయడమేనని విమర్శించారు. పాఠశాల విద్యాశాఖ అక్రమ బదిలీలు అమలుకు పాల్పడితే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అక్రమ బదిలీలకు అవకాశం లేకుండా చూడాలని, సాధారణ బదిలీల షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

గృహనిర్మాణశాఖ అధికారులంతా సమిష్టిగా కృషి చేయాలి: అజయ్‌జైన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకంలో నిర్మిస్తున్న ఇళ్లను సకాలంలో పూర్తి చేసేందుకు గృహనిర్మాణశాఖ అధికారులందరూ సమిష్టిగా పనిచేయాలని రాష్ట్ర గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది కలిసి పనిచేసినప్పుడే ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలను అధిగమించడానికి వీలు కలుగుతుందన్నారు. గృహనిర్మాణశాఖ ఎమ్‌డిగా పనిచేసి ఇటీవల సిఎం కార్యాలయానికి బదిలీపై వెళ్లిన డాక్టర్ నారాయణ భరత్‌గుప్తాకు శుక్రవారం ఆటోనగర్‌లోని గృహనిర్మాణశాఖ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన ఎమ్‌డి లక్ష్మీషా, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్, చీఫ్ ఇంజనీర్ జివి ప్రసాద్, ఐఎఎస్ అధికారులు షన్మోహన్, భావనా వశిష్ట, ఉద్యోగులు పాల్గొన్నారు.

26 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు

- రూ.3450 కోట్లతో వ్యయంతో నిర్మాణం
- పరిశ్రమదారులకు ఎల్లవేళలా సహకారం : సిఎం జగన్
- పల్నాడులో ఐటిసి గ్లోబల్ స్పైసెస్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం



గ్లోబల్ స్పైసెస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న సిఎం జగన్

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులకు తగిన ధరలు కల్పించేందుకు అన్ని జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. పరిశ్రమలు పెట్టే వారికి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం వంకాయలపాడులోని భారత స్పైసెస్ బోర్డు ప్రాంగణంలో ఐటిసి సంస్థ రూ.200 కోట్లతో నిర్మించిన గ్లోబల్ స్పైసెస్ ప్రాసెసింగ్ యూనిట్ (మిర్చి)ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండిస్తున్న ఉత్పత్తులకు ఇతర అనుబంధ ఉత్పత్తులను అనుసంధానం చేసి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నెలకొల్పాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.3450 కోట్లతో 26 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తద్వారా రైతులకు మంచి ధరలు లభిస్తాయని తెలిపారు. ఈ యూనిట్లు అన్నీ పూర్తయితే 33 వేల మందికి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. వచ్చే డిసెంబర్, జనవరి నెలల్లో పది జిల్లాల్లో రూ.1250 కోట్లతో ఈ ప్రాసెసింగ్ యూనిట్లు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నామన్నారు. విత్తనం సరఫరా నుంచి పంట కొనుగోలు వరకు ఆర్‌బికెలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. వంకాయలపాడులో ఐటిసి సంస్థ వారికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా వెంటనే తనకు ఫోన్ చేయాలని ఐటిసి చైర్మన్ సంజయ్ పురికి సూచించారు. ఐటిసి ఏర్పాటు చేసిన ఈ యూనిట్ ద్వారా ఏటా 20 వేల మెట్రిక్ టన్నుల మిర్చితోపాటు మరో 15 రకాల సుగంధ ద్రవ్యాలను ప్రాసెస్ చేసి ఇక్కడ నుంచి ఎగుమతి చేయడం ముదావాహమన్నారు. మిర్చితోపాటు అల్లం, పసుపు, ధనియాలు, యాలకులు వంటి 15 రకాల సేంద్రియ సుగంధ ద్రవ్యాలను ప్రాసెస్ చేస్తారని తెలిపారు. ఈ ప్లాంట్ తొలిదశ పూర్తయిందని, రెండో దశ కూడా మరో 15 నెలల్లో పూర్తవుతుందని అన్నారు. అది కూడా పూర్తయితే ఆసియా ఖండంలోనే అతిపెద్ద సుగంధ ద్రవ్యాల ప్రాసెసింగ్ యూనిట్‌గా వంకాయలపాడు ప్లాంట్ అవతరించనునందని ఐటిసి చైర్మన్ చెప్పడం అభినందనీయమన్నారు. గత మూడేళ్ల నుంచి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, అంబటి రాంబాబు, విడదల రజని, ఐటిసి చైర్మన్ సంజయ్ పురి, జాతీయ సుగంధ ద్రవ్యాల బోర్డు కార్యదర్శి సతీయన్, నర్సరావుపేట ఎంపి లావు కృష్ణదేవరాయులు, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌లో 23,303 సీట్లు ఖాళీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజనీరింగ్‌లో 23,303 సీట్లు మిగిలాయి. ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన ఇఎపిసెట్ కౌన్సిలింగ్ స్పెషల్ రౌండ్ కౌన్సిలింగ్ శుక్రవారంతో ముగిసింది. అభ్యర్థులకు అలాట్‌మెంట్ ఆర్డర్లను ఇఎపిసెట్ అడ్మిషన్ల కన్వీనర్ సిహెచ్ నాగరాణి విడుదల చేశారు. తుది దశ కౌన్సిలింగ్ తరువాత మిగిలిన సీట్ల భర్తీ కోసం ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇందులో కూడా అదనంగా సీట్లు మిగిలాయి. తుది కౌన్సిలింగ్‌లో 20,035 సీట్లు మిగిలాయి. ప్రత్యేకంగా నిర్వహించిన కౌన్సిలింగ్‌లో 23,303 మిగిలాయి. ఈ రౌండ్‌లో సీట్లు అదనంగా భర్తీ కాకపోగా, అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులే 3,268 మంది తగ్గారు. 250 కళాశాలల్లో 1,13,403 కన్వీనర్ సీట్లు ఉంటే 90,100 సీట్లు భర్తీ అయ్యాయి. 23,303 సీట్లు భర్తీ కాలేదు. ప్రభుత్వ యూనివర్సిటీల్లో 1,507 సీట్లు, ప్రైవేట్ యూనివర్సిటీల్లో 289 సీట్లు, ప్రైవేట్ కళాశాలల్లో 21,507 సీట్లు మిగిలాయి.

మోడీ రాకతో ఎపికి ఒరిగేదేమీ లేదు

- ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖ)



ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ వస్తున్న సందర్భంగా రాష్ట్రానికి ఒరిగేదేమి లేదని ఎపి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ అన్నారు. విశాఖలోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కేవలం బటన్ నొక్కి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు విశాఖ రావాల్సిన అవసరం లేదన్నారు. అదానీకి అమ్మడం కోసం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను రూ.400 కోట్లతో ఆధునీకరణ చేస్తున్నారని విమర్శించారు. గుజరాత్‌లోని ఫిషింగ్ హార్బర్‌కు రూ.7 వేల కోట్లు మంజూరు చేసి, ఎపిలో హార్బర్‌కు రూ.152 కోట్లు మాత్రమే మంజూరు చేయడం సరికాదన్నారు. విభజన హామీలు నెరవేర్చి రాష్ట్రాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధోరణి వల్ల ఆంధ్రప్రదేశ్ పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. రెండు ప్రభుత్వాలు కూడా ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక దేశాభివృద్ధి కంటే వ్యాపారులే బాగా అభివద్ధి చెందారని అన్నారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్, విశాఖ స్టీల్ ప్లాంట్‌లను ప్రైవేటీకరణ పేరుతో వ్యాపారులకు ధారాదాత్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంద న్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం పై వైసిపి, టిడిపి, జనసేన నేతలు మోడీని నిలదీయాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు, అన్ని విభజన హామీలు నెరవేర్చాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించొద్దని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి వైస్ ప్రెసిడెంట్ జి.ఎ.నాయుడు, సిపిఎం నాయకులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, సిపిఐ కార్పొరేటర్ ఎ.జె స్టాలిన్ పాల్గొన్నారు.

'కాలిన' బతుకులు..!

- అనుమతులు తక్కువ.. తయారీ ఎక్కువ
- అదే ప్రమాదానికి మూలకారణం?



పేలుడులో ధ్వంసమైన పూరి గుడిసెలు, ద్విచక్రవాహనం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్, అమరావతి బ్యూరో

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం గ్రామీణ మండలం కడియద్ద గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకున్న బాణసంచా పేలుడు ప్రమాదంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన అన్నవరం సుమారు ఐదేళ్ల క్రితం కడియద్ద గ్రామంలో బాణసంచా తయారీ పరిశ్రమకు అనుమతులు తీసుకున్నాడు. 15 కిలోల వరకు పొటాషియం దిగుమతి చేసుకునేందుకు అధికారులు అనుమతులిచ్చారు. ఇటీవల పలు రాష్ట్రాల నుంచి ఆర్డర్లు ఎక్కువగా రావడంతో తయారీదారుడు నిబంధనలు తుంగలో తొక్కాడని, 24 టన్నుల పొటాషియంతోపాటు పేలుడుకు సంబంధించిన ఇతర సామగ్రిని ఇటీవల దిగుమతి చేసుకున్నాడని గ్రామస్తులు తెలిపారు. పరిమితికి మించి మందుగుండు నిల్వలను దిగుమతి చేసుకున్నా అధికారులు పట్టించుకోకపోవడం, నిబంధనలకు వ్యతిరేకంగా విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు, దీనికి తోడు తాటాకులతో గుడిసెలు వేసి అందులో కూలీలు పని చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. అనుమతులకు మించి పొటాషియం దిగుమతి చేసుకోవడం, ఒత్తిడి అధికమవ్వడంతో ఈ ప్రమాదం సంభవించి ఉండొచ్చని వారు అనుమానం వ్యక్తం చేసుకున్నారు. ప్రమాద స్థలికి అగ్నిమాపక శకటం చేరుకునేందుకు రహదారి లేకపోవడంతో దూరంగా వాహనాన్ని నిలిపివేశారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పక్కనే ఉన్న చెరువులో ఇంజన్‌ను ఏర్పాటు చేసి ఆ నీటితో మంటలను అదుపు చేశారు.

అగ్నికీలలు, మరోవైపు పేలుడు శబ్దాలు వినిపిస్తుండడంతో గంట వరకు ప్రమాద స్థలానికి చేరుకోవడానికి ఎవరూ సాహసించలేకపోయారు. ఆ తర్వాతే కడియద్దతో పాటు, చుట్టు పక్కల గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని సహకారం అందించారు.

నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

పేలుడు దాడికి కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన యాళ్ల ప్రసాద్, రొయ్యల స్వామి, నాగిరెడ్డి నాని అక్కడికక్కడే మరణించారు. తీవ్రగాయాల పాలైన నల్లజర్ల మండలం అనంతపల్లికి చెందిన రాజు చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. పేలుడు ధాటికి శరీరభాగాలు చెల్లాచెదురుగా పడిపోవడంతో మృతుల సంఖ్య అధికంగా ఉండొచ్చని తొలుత భావించారు.

గవర్నర్ దిగ్భ్రాంతి

బాణాసంచా తయారీ యూనిట్‌లో గురువారం జరిగిన పేలుడు ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోవడం పట్ల గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంఘటన వివరాలను రాజ్‌భవన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా ద్వారా తెలుసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నట్లు గవర్నర్‌కు జిల్లా యంత్రాంగం సమాచారం తెలిపింది. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని గవర్నర్ అధికారులను ఆదేశించారు.

'ఉక్కు' శిబిరంపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

కన్వీనర్ జె.అయోధ్యరామ్, చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ తదితరులతోపాటు ఆరుగురు మహిళలు ఉన్నారు. అరెస్టుల అనంతరం దీక్షా శిబిరం చుట్టూ పోలీసు పహరా కొనసాగించారు. స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల కార్యాలయాలపై పోలీసులు గట్టి నిఘా పెట్టారు. నాయకుల కదలికలను ప్రతిక్షణం పరిశీలిస్తున్నారు.

అరెస్టులకు ముందు దీక్షా శిబిరంలో పాల్గొన్న వారిని ఉద్దేశించి జివిఎంసి కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుండడం శోచనీయమన్నారు. ఉక్కు కార్మికుల పోరాటానికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ కదిలొచ్చి మద్దతు తెలిపి కేంద్రాన్ని నిలదీయాలని కోరారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ లక్షల కోట్ల రూపాయల విలువైన స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మికుల మనోభావాలను అర్థం చేసుకోవాలని కోరారు. జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కార్మికులు శాంతియుతంగా పోరాటం చేస్తుంటే, పోలీసులు నిర్బంధం ప్రయోగించడం దారుణమన్నారు. టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వ తీరును ఖండించారు. గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను టిడిపి తొలి నుంచీ వ్యతిరేకిస్తోందన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి అరెస్టు, పలువురు గృహనిర్బంధం

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడును పోలీసులు శ్రీనగర్ వద్ద అడ్డుకుని భీమిలి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. మల్కాపురం జోన్‌లో పలువురు నాయకులను గృహ నిర్బంధం చేశారు.

గుప్పిడిపేటలో 25 ఇళ్లు దగ్ధం

ప్రజాశక్తి - పోలాకి (శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలంలోని మత్స్యకార గ్రామమైన గుప్పిడిపేటలో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించి 25 ఇళ్లు దగ్ధమయ్యాయి. ఇందులో 18 ఇళ్లు పూర్తిగా దగ్ధం కాగా, ఏడు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని మత్స్యకారులు చేపల వేటతో పాటు వ్యవసాయ పనులకు కూలీలుగా వెళ్తుంటారు. ఎప్పట్లాగే శుక్రవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కడుపు కృష్ణ ఇంటి నుంచి మంటలు రేగాయి. క్రమంగా చెలరేగి చుట్టూ ఉన్న ఇళ్లకు మంటలు వ్యాపించాయి. కోటబొమ్మాళి నుంచి అగ్నిమాపక శకటం ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసింది. అప్పటికే 18 ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఏడు ఇళ్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో పలువురు ఇంట్లో ఉన్న నగదు, బంగారం, ఇతరత్రా వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. ఇంట్లో దీపం వల్ల గానీ కట్టెల పొయ్యి నుంచి గానీ మంటలు వ్యాపించి ఉంటాయని భావిస్తున్నారు.

బాగా చదువుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఉపముఖ్యమంత్రి అంజాద్ బాష, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, విడదల రజిని, మేరుగ నాగార్జున, మండలిలో చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు,అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు మెడికల్ కళాశాలలో పైలాన్ ఆవిష్కరణ

గుంటూరు మెడికల్ కళాశాలలో ప్లాటినం జూబ్లి పైలాన్‌ను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. కళాశాల స్థాపించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కళాశాలలోని ఖాళీల భర్తీతో పాటు, 32 పీజీ సీట్లు, ఎనిమిది సూపర్ స్పెషాలిటీ సీట్లు పెంచినందుకుగాను ముఖ్యమంత్రికి కళాశాల ప్రిన్సిపల్ డా. పద్మావతి దేవి కృతజ్ఞతలు తెలిపారు. 'ది ఫాదర్స్ హెల్తీ విజన్ అండ్ ది సన్స్ గ్లోరిస్ మిషన్' నినాదంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, సిఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రాలతో కూడిన ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు. జూనియర్ డాక్టర్ల స్టైఫండ్ పెంచినందుకు ముఖ్యమంత్రికి ఎపి జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్యవాదాలు తెలిపి డాక్టర్‌గా ఉన్నప్పటి రాజశేఖర్‌రెడ్డి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమానికి హాజరైన మెడికల్ కళాశాల విద్యార్థులను సిఎం పలకరించి, కరచాలనం చేశారు.

కార్మికుల అరెస్టు సిగ్గుచేటు

- రాష్ట్ర ప్రభుత్వ రెండు నాల్కల ధోరణి
- సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించొద్దని 638 రోజులుగా నిరసన చేస్తున్న దీక్షా శిబిరంలోని కార్మికులను, నాయకులను మోడీ మెహర్బానీ కోసం అరెస్టు చేయడం సిగ్గుచేటని, తెలుగు ప్రజలను అవమానపర్చడమేనని, ఈ అరెస్టులను సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండిస్తుందని రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. అరెస్టు చేసినవారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'ప్రధానమంత్రి పర్యటన పేరుతో దీక్షలో కూర్చున్న కార్మికులను, నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికం. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానం చేసింది. బిజెపి మినహా వైసిపి సహా అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు, వ్యక్తులు ఆందోళన చేస్తున్నాయి. మద్దతు తెలియజేశాయి. వైసిపి ప్రభుత్వం మాత్రం ఒకవైపు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ వద్దంటూనే మరోవైపు కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని ప్రసన్నం చేసుకోవడానికి అరెస్టులు చేస్తోంది. ఈ ఘటనతో వైసిపి ప్రభుత్వ రెండు నాల్కల ధోరణి స్పష్టంగా వెల్లడవుతోంది. గత 638 రోజులుగా దీక్షలు జరుగుతున్నా విశాఖ నగరం ప్రశాంతంగానే ఉంది, అనేకమంది ప్రముఖులు నగరాన్ని సందర్శించారు కూడా. ప్రధాని పర్యటనకు ఈ దీక్ష ఎటువంటి ఆటంకం కల్గిస్తుందని రాష్ట్రప్రభుత్వం భావించిందో సమాధానం చెప్పాలి. అరెస్టయిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి యం.జగ్గునాయుడు, స్టీల్‌ప్లాంట్ పోరాట కమిటీ కో- కన్వీనర్ జె.అయోధ్యరాము, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ జి. ఆదినారాయణ, ఐఎన్‌టియుసి యం.రాజశేఖర్, స్టీల్‌ప్లాంట్ పోరాట కమిటీ కో-కన్వీనర్ జి.వెంకట్రావు మరికొంత మంది నాయకులు, కార్మికులు ఉన్నారు. ఈ నాయకులందర్నీ విశాఖకు 20 కిలోమీటర్ల దూరంలోని సబ్బవరం, పెందుర్తి పోలీసు స్టేషన్‌లో పెట్టడం అన్యాయం.' రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై చిత్తశుద్ధితో వ్యవహరించాలని, అరెస్టు చేసినవారిని వెంటనే విడుదల చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తుంది.

అరెస్టులను ఖండించిన సిపిఐ

నరేంద్రమోడీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా విశాఖలో సిపిఐ, సిపిఎం, ట్రేడ్ యూనియన్ నాయకుల అరెస్టులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రానికి మోడీ ఏం చేశారని కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి జగన్‌మోహన్ రెడ్డి రెడ్ కార్పెట్ వెల్కమ్ చెబుతున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కేసుల మాఫీ కోసం మోడీకి మోకరిల్లుతున్నారని పేర్కొన్నారు. మోడీకి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ రైల్వే జోన్ గురించి ప్రధాని మాట్లాడాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలిపేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అరెస్టులు, నిర్బంధాలు తగవు

- నేడు కూర్మన్నపాలెం వద్ద నిరసనలు
- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే నిర్ణయం చేసినప్పటి నుంచి 636 రోజులుగా శాంతియుతంగా నిరసన దీక్షలు చేస్తున్న కార్మికులను అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానించి, కార్మికులకు మద్దతు అంటూనే పోలీసులతో నిరసనలపై నిర్బంధం విధించే చర్యలకు దిగుతోందని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉక్కు పరిరక్షణకు వైసిపి మద్దతు ఇస్తోందని చెప్పిన జగన్ ప్రభుత్వం ఇలా అరెస్టులకు పాల్పడి తన నిజ స్వరూపాన్ని బయటపెట్టిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కుమ్మక్కయి స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే పథకంతో కుట్రలు చేస్తున్నాయని తెలిపారు. మోడీ మాకు ఏం తెస్తారు ? ఏమిస్తారు ? అని ఇక్కడ ప్రజానీకం అడగడం లేదని, స్టీల్‌ప్లాంట్‌ను అమ్మొద్దని మాత్రమే మొరపెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. ఉక్కు పరిరక్షణ ఉద్యమ నేతలను అక్రమంగా అరెస్టు చేసిన ప్రభుత్వ తీరును నిరసిస్తూ కార్మికులు శనివారం ఉదయం 8 గంటలకు స్టీల్‌ప్లాంట్ గేటు వద్ద నిరసనలు తెలపాలని కోరారు. పెద్ద సంఖ్యలో కార్మికులు తరలి వచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొని స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాలని నర్సింగరావు విజ్ఞప్తి చేశారు.



ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశంలో ప్రసంగిస్తున్న వై.కేశవరావు

చలో రాజ్‌భవన్‌కు రైతులు భారీగా తరలిరావాలి

- భూముల రీ-సర్వే పొరపాట్లను వెంటనే సరిదిద్దాలి
- ఎపి రైతు సంఘాల సమన్వయసమితి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానాలకు భిన్నంగా వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ఈనెల 26న విజయవాడ ధర్నా చౌక్‌లో సభ, అనంతరం గవర్నర్‌కు మెమోరాండం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి నిర్ణయించింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో చలో రాజ్‌భవన్‌కు సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్ ఝాన్సీ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. సభలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం సంయుక్త కిసాన్‌మోర్చాకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసంచేసిందన్నారు. భూముల రీసర్వే ప్రొసీజర్ ప్రకారం అధికారులు వ్యవహరించకపోవడంతో రైతులకు నష్టం జరుగుతోందన్నారు. భూముల రీ సర్వే ప్రొసీజర్స్‌పై రైతుల్లో అవగాహన కలిగించేందుకు కరపత్రాలు, అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, రైతాంగ సమాఖ్య అధ్యక్షులు యెర్నేని నాగేంద్రనాథ్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి కెవివి ప్రసాద్, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ భూముల రీ సర్వే కార్యక్రమంలో జరిగే ప్రతి విషయాన్ని రైతులకు తెలియజేయాల్సి ఉన్నప్పటికీ ఎస్‌ఓపి పేరుతో రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే గ్రామసభ జరపకుండానే రికార్డులు తయారు చేస్తున్నారన్నారు. 22(ఎ) ప్రకారం నిషేధిత భూములపై నిషేధం తొలగించి పట్టాలివ్వాలని హైకోర్టు చెప్పినప్పటికీ ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. హైకోర్టు తీర్పు అమలు చేయాలని కోరుతూ తిరుపతి, విజయవాడ, విశాఖల్లో ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తుండటంతోపాటు ప్రైవేటు కాంట్రాక్టర్లకు ఇవ్వడానికి రూ.14,300 కోట్లతో టెండర్ పిలిచిందన్నారు. మీటర్లు పెట్టవద్దని ప్రతి గ్రామంలో బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతు భరోసా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం కార్యదర్శి హరినాథ్, రైతు సంఘం కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్‌మోర్చా కాంగ్రెస్ అధ్యక్షులు గుర్నాథరావు, తెలుగురైతు ఉపాధ్యక్షులు చెరుకూరి రాజేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల నాయకులు చుండూరి రంగారావు, జెట్టి గురునాథరావు, డాక్టర్ కొల్ల రాజమోహన్, డి. హరినాథ్, సిహెచ్ కోటిరెడ్డి, వి.కృష్ణయ్య ప్రసంగించారు.

80 నిమిషాల్లో అమ్ముడైన శ్రీవారి దర్శన టికెట్లు

ప్రజాశక్తి-తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానం ఆన్‌లైన్‌లో విడుదల చేసిన దర్శన టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. డిసెంబర్ నెలకు సంబంధించి శుక్రవారం ఉదయం పది గంటలకు టికెట్లు విడుదల చేయగా 80 నిమిషాల్లో 5,06,600 టికెట్లు బుక్ అయ్యాయి. జియో మార్ట్ క్లౌడ్ టెక్నాలజీ సహకారంతో భక్తులకు ఎలాంటి అంతరాయం కలగలేదని టిటిడి పేర్కొంది. రూ.300 దర్శన టికెట్ల విక్రయం ద్వారా రూ.15.20 కోట్ల ఆదాయం లభించిందని తెలిపింది.

బూర్గంపాడును కలపండి

- కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రస్తుతం తెలంగాణలో ఉన్న బూర్గంపాడు రెవెన్యూ గ్రామాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కలపాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. ఈ మేరకు కేంద్రానికి తాజాగా లేఖ రాసింది. గతంలో కూడా ఇదే విషయాన్ని లేవనెత్తినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడంతో కేంద్రం దానిని పక్కన పెట్టింది. అయితే, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తిస్థాయిలో ఆటంకాలు రాకుండా ఉండాలంటే బూర్గంపాడును రాష్ట్రంలో కలపడం ఒక్కటే మార్గమని ప్రభుత్వం వాదిస్తోంది. ఈ నెల 23న కేంద్ర అధికారులతో జరిగే సమావేశంలో కూడా ఈ విషయాన్ని ప్రస్తావించాలని అధికారులు నిర్ణయించారు. 2014నుండి కేంద్రం వద్ద ఈ విషయాన్ని లేవనెత్తుతున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. రి

సహకారాభివృద్ధి నిధులు పక్కదారి

- ఆరా తీస్తున్న ఎన్‌సిడిపి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సమగ్ర సహకారాభివృద్ధి పథకం ద్వారా అమలు చేయాల్సిన పనులకు సంబంధించిన నిధులు పక్కదారిపట్టినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మొత్తం దాదాపు 279 కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. దీంతో మంజూరు చేసిన నిధులు, చేసిన ఖర్చు తదితర అంశాలపై జాతీయ సమగ్ర సహకారాభివృద్ధి సంస్థ అధికారులు ఆరా తీస్తున్నారు. రుణమిచ్చిన నిధులు గడువు దాటిపోయిన తరువాత కూడా వ్యయం కాకపోవడంపై రాష్ట్ర సహకార, రిజిస్ట్రార్ కో-ఆపరేటివ్ సొసైటీకి లేఖ రాశారు. ఈ నిధులను ఇతర అవసరాల కోసం వినియోగించి ఉంటారని భావిస్తున్నారు. సహకార సొసైటీల ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎన్‌సిడిసి ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు ఇస్తారు. పర్యాటకం, వ్యవసాయం, చేనేత, గ్రామీణ పరిశ్రమలు, ఉద్యానవన పంటలు, గృహ పరిశ్రమలు వంటివాటికి సహకార సొసైటీల ద్వారా సాయం అందిస్తారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని తూర్పుగోదావరి, కర్నూలు, చిత్తూరు జిల్లాలను ఎంపిక చేసి ఈ రుణాన్ని అందించారు. ఈ రుణ నిధులను విడుదలైన నెల రోజుల్లోగా ఆయా ప్రాజెక్టులకు బదిలీ చేయాలన్నది నిబంధన. అయితే విడుదలై దాదాపు 10 నెలలు కావస్తున్నప్పటికీ ఆయా ప్రాజెక్టు నిర్వహణ సంస్థలకు నిధులు చేరలేదు. దీంతో ఈ మొత్తంపై ఆరా తీసిన కేంద్ర అధికారులు తక్షణమే ఆ నిధులను సంబంధిత పథకాల నిర్వహణ సంస్థలకు బదిలీ చేయాలని కోరింది.



విజయవాడ అలంకార్ సెంటర్ వద్ద నిరసనలో వామపక్షాలు, కార్మిక సంఘాల నాయకులు


విశాఖ జిల్లా సుజాతనగర్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

మోడీకి రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదు

- విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దు
- విభజన హామీలు అమలు చేయాలి
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రధాన మంత్రి మోడీ రాకను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. విభజన హామీలు, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్న ప్రధానికి రాష్ట్రంలో పర్యటించే నైతికహక్కు లేదని వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నల్లజెండాలు చేతబూని శుక్రవారం ఆందోళనలు చేపట్టారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటికరించొద్దని, గనులు కేటాయించి, వంద శాతం ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడిపాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. విభజన హామీలు అమలు చేయాలని, ప్రత్యేక హోదా ప్రకటించాలని నినాదాలు చేశారు.

మోడీ రాకను నిరసిస్తూ విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో నిరసనలు హోరెత్తాయి. విశాఖ నగరంలోని హెచ్‌పిసిఎల్ మెయిన్ గేటు వద్ద నల్లబ్యాడ్జీలతో కార్మికులు నిరసన చేపట్టారు. 97వ వార్డు సుజాతనగర్, భెల్ మెయిన్‌గేటు వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి, నర్సీపట్నంలో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. అనకాపల్లి, పరవాడ, సబ్బవరం, కె.కోటపాడు మండలాల్లో నిరసనలు జరిగాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, డుంబ్రిగుడ, అరకులోయ, కూనవరం మండలాల్లో ఆందోళన చేశారు.

కాకినాడ జిల్లా సామర్లకోటలో రైల్వే గేటు సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద వామపక్ష నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు- విభజన హామీలు అమలు చేయాలంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. తిరుపతిలో నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసి, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు ఆజ్యం పోస్తున్న మోడీకి ఆంధ్రాలో పర్యటించే హక్కు లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ అన్నారు. చిత్తూరులో నిరసన ర్యాలీ జరిగింది. కర్నూలు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసనలో సిఐటియు రాష్ట్ర నాయకులు గౌస్‌దేశాయి మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలని వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్ల వద్ద నల్లజెండాలు చేతబూని నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడులోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద చేపట్టిన నిరసనలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు చింతకాయల బాబురావు పాల్గొన్నారు. తాడేపల్లి గూడెంలోని పోలీసు ఐల్యాండ్, భీమవరంలో ధర్నా, తణుకులో నిరసన చేశారు. ఏలూరు జిల్లా చింతలపూడిలో రాస్తారోకో నిర్వహించారు. గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో వివిధ రంగాల కార్మికులు నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిరసన ప్రదర్శన చేశారు. కడపలో కలెక్టరేట్ వద్ద ధర్నా, రాజంపేటలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతపురం నగరంలోని టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని మేమారెడ్డి సర్కిల్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నెల్లూరు జిల్లాలోని కందుకూరు, కావలిలో నల్ల జెండాలతో ఆందోళన చేశారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని పలుచోట్ల నల్లజెండాలతో నిరసన చేశారు. టెక్కలి, పలాస, కంచిలి, రణస్థలం మండలం పైడిభీమవరంలో నిరసనలు చేపట్టారు. కృష్ణాజిల్లాలోని మచిలీపట్నంలోని కోనేరు సెంటరులో నిరసన కార్యక్రమం జరిగింది. గుడివాడలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎపి ఎఐసిసి సభ్యులు కామన ప్రభాకరరావు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. మోడీ పర్యటనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యాన విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసన తెలిపారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక ఆధ్వర్యాన విజయవాడ అలంకార్ సెంటర్‌లో నిర్వహించిన నిరసనలో వామపక్షాలు, కార్మిక, సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ ముందు అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన పార్టీలు మోకరిల్లడం సిగ్గుచేటని విమర్శించారు. వైసిపి, తెలుగుదేశం పార్టీలు తీరు మార్చుకోకపోతే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్, దుర్గారావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆవుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

పరిహారం త్వరగా అందించండి

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ ప్రాజెక్టులకు భూములిచ్చిన రైతులకు పరిహారం త్వరగా అందించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విజయనగరం కలెక్టరేట్‌లో కలెక్టర్ సూర్యకుమారి, జెసి మయూర్ అశోక్, అర్‌డిఒ సూర్యకళతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్, ట్రైబల్ యూనివర్సిటీ, ధాన్యం సేకరణ, తదితర అంశాలపై సమీక్షించారు. ఎయిర్‌పోర్ట్ భూ సేకరణకు సంబంధించిన పరిహారాన్ని త్వరగా చెల్లిస్తే శంకుస్థాపన పనులకు సిద్ధం కావచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణకు సంబంధించిన ప్రణాళికను మంత్రికి కలెక్టర్ వివరించారు. ఈ నెల 15 నుండి కొనుగోలుకు ప్రణాళిక వేసినట్లు తెలిపారు. బ్యాంకు గ్యారంటీలు, గోనె సంచులు, రవాణా తదితర అంశాలపై వివరించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏ ఒక్క రైతుకు చెల్లింపుల బకాయిలు ఉంచకుండా చూడాలని మంత్రి సూచించారు. సమావేశం అనంతరం విలేకరులతో బొత్స మాట్లాడుతూ గిరిజన విశ్వవిద్యాలయానికి భూ సేకరణ పనులు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. రైతుల నుండి బలవంతంగా భూములు తీసుకోబోమని, వారిని ఒప్పించి, అంగీకరించిన మీదటే భూములకు తగిన పరిహారం చెల్లించి తీసుకుంటామని చెప్పారు.



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మణరావు

సిపిఎస్ రద్దు చేయాలి

- ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు వినతి

ప్రజాశక్తి-గుంటూరు

సిపిఎస్ రద్దు చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కోరారు. గుంటూరు వచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డిని శుక్రవారం లక్ష్మణరావు కలిసి సిపిఎస్, పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సిపిఎస్ స్థానంలో ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న జిపిఎస్‌ను ఉద్యోగులు, ఉపాధ్యాయులు అంగీకరించరని, మూడు లక్షల మంది ఉద్యోగులకు లబ్ది చేకూరే విధంగా సిపిఎస్ స్థానంలో ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. మూడు నెలలుగా మంత్రి, అధికారులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఇంత వరకూ బదిలీ ఉత్తర్వులు రాలేదని చెప్పారు. బదిలీలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలపాలని కోరారు. ఎయిడెడ్, గురుకుల ఉపాధ్యాయులు, సిబ్బందికీ, గ్రంథాలయాలు, యూనివర్సిటీల బోధనా సిబ్బందికీ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. వేలాది మంది ప్రజలకు, తాగుసాగు నీరు అందించే గుంటూరు ఛానల్ విస్తరణకు అవసరమైన భూసేకరణకు రూ.113 కోట్లు నిధులు విడుదల చేయాని ముఖ్యమంత్రిని కోరారు.


నిర్వాసితుల దీక్షలను ప్రారంభిస్తున్న మర్రాపు సూర్య నారాయణ

భూమికి బదులు భూమివ్వాలి

- గిరిజన యూనివర్సిటీ నిర్వాసితుల నిరాహార దీక్ష

ప్రజాశక్తి-మెంటాడ (విజయనగరం)

గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి ఇచ్చిన తమ భూమికి బదులుగా భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విజయనగరం మెంటాడ మండలం కుంటినవలస గ్రామంలోని సచివాలయం ఎదురుగా రైతులు ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ నిర్వాసితులకు పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోతున్న గిరిజన యూనివర్సిటీ నిర్వాసితులకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, తప్పులు ఉన్న భూమి వివరాలు సరిచేసి అనుభవదారులకు పరిహారం ఇవ్వాలని, సాగులో ఉన్న భూమికి, అన్ని రకాల చెట్లకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యలను తక్షణమే పరిష్కారించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, సహాయ కార్యదర్శి రాకోటి రాములు, సిపిఎం జిల్లా సహాయ కార్యదర్శి గొర్లె శ్రీనివాసరావు, డప్పు కళాకారుల సంఘం మండల కార్యదర్శి సింహాచలం పాల్గొన్నారు.


పెద్దబిడ్డ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వెంకటేశ్వరరావు

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని పెద్దబిడ్డ, బొర్రా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను, అనంతగిరిలోని బాలికల 1, 2 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని దెబ్బతీసే నిర్ణయాలను అమలు చేస్తోందని తెలిపారు. పాఠశాలల విలీనం పేరుతో ఉపాధ్యాయులను, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. 'నాడు-నేడు'తో పాఠశాలల రూపురేఖలు మార్చామని చెబుతున్న ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలలు, వసతి గృహాల్లో కనీస సౌకర్యాలను కూడా కల్పించలేదని తెలిపారు. నాణ్యమైన మెనూ ఎక్కడా అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల కొరత నెలకొందని, ఏజెన్సీలో మాతృభాషా వలంటీర్లను రెన్యువల్ చేయకపోవడంతో గిరిజనులకు సరైన విద్య అందడం లేదన్నారు. వెంటనే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, మాతృభాషా విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. పాడేరులో ఈ నెల 20న విద్యా రంగం సమస్యలపై రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం చలో పాడేరు పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పరిహారం ఎప్పుడు?

- వెలుగొండ నిర్వాసితుల జాబితా సిద్ధం
- నిధుల కోసం ఎదురుచూపులు
- వచ్చే అక్టోబరులో నీళ్లిస్తామని ప్రకటించిన సిఎం జగన్

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

'వచ్చే ఏడాది అక్టోబరులో వెలుగొండ ప్రాజెక్టు నీళ్లు రైతులకు ఇచ్చాకే ఎన్నికలకు పోతాం'

- చీమకుర్తిలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన ఇది.

ఈ ప్రక్రియ అనుకున్నట్లుగా జరగాలంటే అన్నింటి కన్నా ముందు నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వాలి. ఇళ్లు ఖాళీ చేసేందుకు పరిహారం ఇవ్వాలి. గ్రామాలు ఖాళీ చేశాక మళ్లీ ఉండేందుకు కాలనీలు కావాలి. స్థలాలు కేటాయించాలి. అందులో ఇళ్లు కట్టుకోవాలి. ఇవన్నీ జరగాక వెలుగొండ ప్రాజెక్టు నుంచి నీళ్లివ్వడానికి వీలుంటుంది. ఇంకా 11 నెలలే గడువు ఉంది. సిఎం మాటలు సాకారం కావాలంటే నిర్వాసితులకు చేయాల్సినవి పూర్తి చేయాలి. ఆ దిశగా ఇప్పుడు చర్యలు వేగవంతంగా లేవు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. ఇంకా ఉద్యోగులకు వేతనాలు కూడా రాలేదనే చర్చ సాగుతోంది. చేసిన అభివృద్ధి పనులకు వందల కోట్ల రూపాయల్లో బిల్లులు బకాయి ఉన్నాయి. అందరూ ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు నిర్వాసితుల వంతయింది.

వెలుగొండ ప్రాజెక్టు కింద 4.20 లక్షల ఎకరాలకు సాగు నీరు, 15 లక్షల మందికి తాగునీరు ఇవ్వాలన్నది లక్ష్యం. ఇప్పటికే రూ.6 వేల కోట్లకుపైగా దీనికి వెచ్చించారు. డ్యాము పనులు పూర్తయ్యాయి. ప్రాజెక్టులో కీలకమైన రెండు సొరంగాల్లో ఒకటి పూర్తయింది. రెండో సొరంగం మరో మూడు కిలోమీటర్లు పూర్తి చేయాల్సి ఉంది.



11 గ్రామాల్లో 7500 మంది నిర్వాసితులు

నిర్వాసితుల సంఖ్యను 2019 అక్టోబరులో తేల్చారు. అప్పటివరకూ 21 ఏళ్లు నిండిన వారిని కూడా పెద్దలుగా పరిగణించి ప్యాకేజీల్లో చేర్చారు. 11 ముంపు గ్రామాల్లో నిర్వాసితులు సుమారు 7,500 మంది తేలారు. ఇళ్లూవాకిళ్లు అన్నీ ఎన్యూమరేషన్ చేశారు. ఒక్కో కుటుంబానికి ఇంటి స్థలంతోపాటు ఇల్లు కట్టుకునేందుకు రూ.2 లక్షలు, ప్యాకేజీ కింద రూ.10.50 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇంటి స్థలం వద్దనుకుంటే రూ.12.50 లక్షలు ఇస్తామని తెలిపింది. ఇప్పుడు జాబితాలు సిద్ధం చేశారు. నిధులు కేటాయింపులో జాప్యం జరుగుతోంది. మూడేళ్లుగా ప్యాకేజీల కోసం ఎదురుచూపులే మిగిలాయి. ప్యాకేజీలు, ఇళ్ల స్థలాలు ఇస్తే అక్కడి నుంచీ ఖాళీ చేసి వెళ్లేందుకు సిద్ధమని నిర్వాసితులు చెప్తున్నారు.

రూ.1400 కోట్లు ఇస్తేనే గ్రామాలు ఖాళీ చేసేది!

నిర్వాసితులకు పునరావాసం కోసం కాలనీల ఏర్పాటుతోపాటు ప్యాకేజీలు ఇవ్వాలి. బడ్జెట్ కేటాయింపులు అరకొరగా ఉన్నాయి. కేటాయించిన నిధులు కూడా ఒక్కసారిగా రావడం లేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.850 కోట్ల వరకూ వెలుగొండకు కేటాయించారు. పనులు వేగంగా జరగనందున నిధులు కూడా పెద్దగా ఖర్చవ్వలేదు. నిర్వాసితులకు అందాల్సినవే రూ.1400 కోట్ల వరకూ ఉంటాయని అంచనా.

మళ్లీ తెరపైకి మైనర్ తీరిన యువత

2019 అక్టోబరులో ప్రకటించిన ప్యాకేజీలు వెంటనే ఇస్తే సమస్య వచ్చేది కాదు. ప్రస్తుతం 21 సంవత్సరం వచ్చిన వాళ్లకు కూడా ప్యాకేజీలు ఇవ్వాలనే డిమాండ్ ఇప్పుడు ముందుకు వచ్చింది. ఇటువంటి వారి సంఖ్య 11 గ్రామాల్లో 400 మంది వరకూ ఉన్నట్లు అంచనా. దీనిపై ప్రభుత్వం ఇంకా ఏమీ తేల్చలేదు.

కాలనీల్లో కనీసం సౌకర్యాలు అంతంత మాత్రమే

11 గ్రామాల నిర్వాసితులకు పునరావాస కాలనీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. వీరికి మార్కాపురం, పెద్దారవీడు, కంభం మండలాల్లో ప్లాట్లు వేశారు. పూర్తి స్థాయిలో ఇంకా పట్టాలు ఇవ్వలేదు. గొట్టిపడియ గ్రామ నిర్వాసితులకు స్థలం కేటాయించి ప్లాట్లు వేస్తున్నారు. ఇంకా పట్టాలు ఇవ్వాల్సి ఉంది. తాగునీరు, విద్యుత్తు, గుడి, బడి తదితర కనీస సౌకర్యాలను అన్ని కాలనీల్లోనూ ఏర్పాటు చేయాలి. ఇవి అరకొరగానే జరిగాయి. కాలనీల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేస్తే, గ్రామాలను ఖాళీ చేసి వచ్చేలోపే ఇళ్లు కట్టుకునేందుకు అవకాశం ఉంటుంది. గ్రామాల్లోనే ఉండి కాలనీల్లో ఇళ్లు కట్టుకునేలా ఏర్పాట్లు చేయాలి. కొత్తగా ఇల్లు కట్టుకోకుండా ఖాళీ చేసినా 7,500 మంది నిర్వాసితులు ఎక్కడ ఉంటారనేదీ ప్రశ్నార్థకమే. పట్టణాల్లో ఇంతమందికి అద్దెకు ఇళ్లు దొరకడం కష్టం. వచ్చే ఏడాది అక్టోబరులో వెలుగొండ నీళ్లు ఇవ్వాలంటే పనులు యుద్ధప్రాతిపదికన జరిగితేనే సాధ్యమవుతుంది..

విద్యుద్ఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి-కణేకల్లు (అనంతపురం జిల్లా)

విద్యుద్ఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన అనంతపురం జిల్లా కణేకల్లు మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అంబాపురం గ్రామానికి చెందిన రైతు బ్రహ్మానందరెడ్డి (48)కి జక్కలోడికి గ్రామంలో రెండు ఎకరాల పొలం ఉంది. తన సొంత పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటారు పనిచేయకపోవడంతో మరమ్మతులు చేసేందుకు శుక్రవారం తెల్లవారుజామున పొలానికి వెళ్లారు. మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురై మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రాజధాని పేదలకు ప్రతి నెలా పింఛను

- సిఆర్‌డిఎ కమిషనరు వివేక్‌యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని గ్రామాల్లో భూమిలేని పేదలందరికీ పింఛను సొమ్మును ప్రతి నెలా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని సిఆర్‌డిఎ కమిషనరు వివేక్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమరావతిలోని 29 గ్రామాల్లో భూమిలేని 19,110మంది పేదలకు రూ.2,500 చొప్పున పింఛను సొమ్మును వారి ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.

పరిశ్రమలకు నీటి ఛార్జీల పెంపు

- కిలో లీటరు నీటికి రూ.50 నుంచి రూ.120కు పెంపు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

పరిశ్రమలకు సరఫరా చేసిన నీటి ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. కంపెనీ ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఈ నిర్ణయం తీసుకుంది. అనకాపల్లి జిల్లాలోని పరవాడ ఫార్మా, అచ్యుతాపురం, రాంబిల్లి ఎస్‌ఇజెడ్, ఇతర పరిశ్రమలు, బ్రాండిక్స్‌కు 30 వేల కిలోలీటర్ల నీటిని ఎపిఐఐసి సరఫరా చేస్తోంది. ఈ నీటికి గతంలో ఏడాదికి రూ.54 కోట్లు చెల్లించిన పరిశ్రమలు ఇప్పుడు రూ.129.60 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. పరిశ్రమలకు సరఫరా చేసే నీటి ఛార్జీల పెంపుపై ఈ ఏడాది జనవరి 12న ప్రభుత్వం జిఒ విడుదల చేసింది. దీనిపై ప్రభుత్వ సూచిన మేరకు పరిశ్రమాధిపతుల నుంచి విశాఖపట్నం ఇండస్ట్రియల్ వాటర్ సప్లయి కంపెనీ (విస్కో) అభిప్రా యాలను సేకరించింది. నీటి ఛార్జీలు పెంచొద్దని వచ్చిన అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. నీటి సరఫరా ఛార్జీలు పెంచింది. ఏప్రిల్ నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పలు పరిశ్రమలకు, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి)కు ప్రభుత్వం నిర్దేశిత ధరల ప్రకారం విస్కో నీటిని సరఫరా చేస్తోంది. పరిశ్రమలకు గతంలో ఎపిఐఐసి కిలోలీటరు (వెయ్యి లీటర్లు)కు రూ.50 వసూలు చేసింది. ప్రభుత్వం ధర పెంచి ఏప్రిల్ నుంచి కిలోలీటరుకు రూ.120 చొప్పున వసూలు చేస్తోంది. అనకాపల్లి జిల్లాలోని పరవాడ ఫార్మా, అచ్యుతాపురం, రాంబిల్లిలోని ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్), నాన్ సెజ్‌లోని పరిశ్రమాధిపతులు నీటి భారం ఎక్కువుగా ఉందని ఆందోళన చెందుతున్నారు. అచ్యుతాపురం, రాంబిల్లి సెజ్, బ్రాండిక్స్ ఇతర పరిశ్రమలకు ఎపిఐఐసి ట్రీట్‌మెంట్ చేయకుండా కిలోలీటరుకు రూ.120 చొప్పున వసూలు చేస్తున్నారు.

ర్యాంకీకి రూ.80 నుంచి రూ.85కే

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ర్యాంకీకి మాత్రం రూ.80 నుంచి రూ.85కు నీటిని సరఫరా చేస్తున్నట్లు సంబంధిత అధికారి ఒకరు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ర్యాంకీ మాత్రం ట్రీట్‌మెంట్ చేసిన నీటికి కిలోలీటరుకు రూ.120 చొప్పున ఫార్మా కంపెనీల నుంచి వసూలు చేస్తున్నట్లు పరిశ్రమల యజమానులు చెబుతున్నారు. పరిశ్రమలకు రోజుకు 30 వేల కిలోలీటర్లు నీటిని ఎపిఐఐసి సరఫరా చేస్తోంది. కిలోలీటరుకు గతంలో యాభై రూపాయలు చొప్పున రోజుకు రూ.15 లక్షలు చెల్లించిన పరిశ్రమలు నేడు కిలోలీటరు రూ.120 చొప్పున రూ.36 లక్షలు చెల్లించాల్సి వస్తోంది. దీంతో, పరిశ్రమలపై నెలకు రూ.10.80 కోట్లు చొప్పున ఏడాదికి రూ.129.60 కోట్ల భారం పడుతోంది.

అమరావతి మాస్టర్ ప్లాన్ మార్చొద్దు

మందడం, లింగాయపాలెం గ్రామసభల్లో వ్యతిరేకత

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్‌లో మార్పులపై శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో గ్రామస్తుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. హైకోర్టు గురువారం ఇచ్చిన ఆదేశం మేరకు రాజధాని గ్రామాలైన మందడం, లింగాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద స్పెషల్ ఆఫీసర్ వై సత్య కుమార్ నేతృత్వంలో గ్రామసభలు జరిగాయి. ఈ నెల 18న గెజిట్ పబ్లికేషన్ 13 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మాస్టర్ ప్లాన్ సవరణలు, 28న 1410-జిఒ, 1110 డ్రాఫ్ట్ గెజిట్ నోటిఫికేషన్ ద్వారా సిఆర్‌డిఎ చేసిన ప్రతిపాదనలు తమకు ఆమోదయోగ్యంగా లేవంటూ, గ్రామ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించేలా ఉన్నాయంటూ గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. రాజధాని మాస్టర్ ప్లాన్‌ను విచ్ఛిన్నం చేసేలా సవరణలు ఉన్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ 5 జోన్‌లో ఎ 900.97 ఎకరాలను ఇళ్ల స్థలాలుగా రాజధానేతర పేదలకు ఇవ్వడానికంటూ ప్రభుత్వం నాటకాలాడు తోందని విమర్శిం చారు. టిడ్కో ఇళ్లను పేదలకు ఇంతవరకు ఎందుకు ఇవ్వలే దని ప్రశ్నించారు. రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఐదు శాతం భూములను ఇచ్చే వీలు రాజధాని బృహత్ ప్రణాళికలో ఉందని మందడం గ్రామానికి చెందిన రైతు బెజవాడ రమేష్ అన్నారు.

మాస్టర్ ప్లాన్‌లో సవరణలు, మార్పుల నిబంధనను పక్కన పెట్టి ప్రభుత్వం ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తోందని ఎన్ వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు రాజధానిని అభివృద్ధి చేయాలని కోరుతున్నామని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి వ్యతిరేకం కాదని తెలిపారు. మిగిలిన గ్రామాల్లోనూ రెండ్రోజుల్లో గ్రామ సభలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించాలని శుక్రవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.


మాస్టర్ ప్లాన్‌లో మార్పులకు వ్యతిరేకంగా గ్రామసభలో చేతులెత్తిన లింగాయపాలెం గ్రామస్తులు

సంపాదకీయం


విధ్వంసకారులెవరు?

సామాజిక కార్యకర్త గౌతమ్ నవలఖను జైలు నుంచి గృహనిర్బంధానికి అనుమతిస్తూ భారత సర్వోన్నత న్యాయస్థానం గురువారం వెలువరించిన ఉత్తర్వులు ఆహ్వానించదగినవి. మావోయిస్టులతో సంబంధాలున్నాయంటూ భీమా కోరేగావ్ కేసులో ఉపా చట్టం కింద నవలఖ అభియోగాలు ఎదుర్కొంటున్న సంగతి విదితమే. ఈ కేసు విచారణ సందర్భంగా వృద్ధాప్య సమస్యలతో, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నవలఖ లాంటివారు దేశాన్ని ధ్వంసం చేయాలని కోరుకుంటున్నారని, వారి సిద్ధాంతం కూడా అదేనని కేంద్ర ప్రభుత్వం వాదించింది. నవలఖను జైలు నుంచి ఇంటికి పంపేందుకు అభ్యంతరం తెలిపింది. జస్టిస్ జోసెఫ్, జస్టిస్ హృశికేష్ రాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్ర వాదనపై తీవ్రంగా స్పందించింది. 'దేశాన్ని ధ్వంసం చేస్తున్నదెవరో మీకు చెప్పమంటారా? అవినీతిలో మునిగితేలుతున్నవారే విధ్వంసకారులు...మీరు ఏ కార్యాలయానికైనా వెళ్లండి. అవినీతి తాండవం చేస్తుంటుంది.' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మతతత్వ చిచ్చు రాజేస్తూ అవాస్తవాలతో ప్రజల దృష్టి మరల్చి కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదను దోచిపెడుతూ..ఎన్నికల బాండ్లతో వారు కుమ్మరించే రూ.కోట్లతో ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కూల్చివేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న సర్కార్‌కు లాగి లెంపకాయలు వేసినట్లు అయింది. దేశ విధ్వంసకారులెవరో ధర్మాసనం తేల్చిచెప్పినట్టే కదా!

మూఢత్వం నుంచి ప్రజలను జాగృతపర్చే హేతువాదులు, ఆదివాసీల మనుగడ కోసం పోరుసల్పే సామాజిక కార్యకర్తలు, మానవ హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించే హక్కుల కార్యకర్తలు ..వీరంతా పాలకుల దృష్టిలో అర్బన్ నకల్స్. అంతకు మించి ఈ దేశాన్ని ధ్వంసం చేస్తున్న దేశద్రోహులు. గౌరీ లంకేష్, గోవింద్ పన్సారే, నరేంద్ర దభోల్కర్, కల్బుర్గి వంటివారిని సంఘ్ పరివార్ మూకలు ఈ పేరిటే పొట్టనపెట్టుకున్నారు. స్టాన్‌స్వామి లాంటి వయోధిక సంఘ సేవకులను విచారణ పేరిట జైళ్లలో నిర్బంధించి కనీసం మంచినీళ్లు తాగేందుకు కూడా అనుమతించకుండా ప్రాణాలు తీసేంత క్రూరత్వం చాటుకుందీ సర్కారు. ప్రొఫెసర్ సాయిబాబా విషయంలోనూ ఇంతే క్రూరత్వాన్ని ప్రదర్శించింది. 90 శాతం అంగవైకల్యంతో చక్రాల కుర్చీకే పరిమితమైన ఆయనను ఉగ్రవాదులను ఉంచే అండాకార కారాగారంలో బంధించి కసితీరా కక్షతీర్చుకుంది. ప్రజల్లో ప్రగతిశీల, అభ్యుదయ, ఆధునిక భావాలను రేకెత్తించే వారే ప్రభుత్వానికి ప్రధాన శత్రువులు. నేల మొదలు నింగి వరకు సమస్తం ప్రయివేటీకరిస్తూ, లాభదాయక ప్రభుత్వ సంస్థలను తెగనమ్ముతూ ప్రజల సంపదనంతా ఏ కార్పొరేట్లకు అయితే దోచిపెడుతున్నారో..ఆ అవినీతి రారాజులే మోడీ సర్కార్ దృష్టిలో దేశభక్తులు. వీరు కుమ్మరించే ఎన్నికల బాండ్ల సొమ్ముతో పట్టపగలు సంతలో పశువులును కొన్న చందాన ప్రజా ప్రతినిధులను కొనేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వైనాన్ని చూస్తున్నాం. రూ.లక్షల కోట్ల రుణాలు ఎగవేసి ప్రభుత్వ బ్యాంకుల్ని నిండా ముంచేసిన కార్పొరేట్ అధిపతులు నీరవ్ మోడీ, విజయ్ మాల్యా విదేశాల్లో విలాసాల్లో మునిగితేలుతున్నారంటే అది ప్రభుత్వ చలువే.

భారత సైన్యంలో రాఫెల్ యుద్ధ విమానాలు మొదలుకొని నిన్నటి గుజరాత్‌లోని మోర్బిలో 100 మంది పైగా ప్రాణాలను బలిగొన్న తీగల వంతెన మరమ్మతుల కాంట్రాక్టు వరకు ..అన్నింటా అవినీతి మరకలే. బిజెపి ఏలుబడిలోని కర్ణాటకలో '30 పర్సెంట్ సిఎం' బాగోతం, ఉత్తరప్రదేశ్‌లో నియామకాల కుంభకోణం, ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర నాయకులమంటూ కోట్లు దండుకుంటున్న నేతలు..మొన్న మహారాష్ట్ర, నిన్న ఢిల్లీ, ఇప్పుడు తెలంగాణ ప్రజాప్రతినిధల కొనుగోళ్ల కోసం కోట్ల కుమ్మరింత..దేశంలో అవినీతి రాజ్యమేలుతోందని చెప్పడానికి ఇంతకంటే ఏమి కావాలి? ప్రజల సంపదనంతా దొడ్డిదారిన దోచుకుంటూ కార్పొరేట్ గుత్తాధిపత్య రాజ్యంగా మారుతున్న దేశంలో అసలు విధ్వంసకారులు వీరిని మించిన వారు ఎవరు? అవినీతిపరులకు స్వేచ్ఛ కల్పించి హక్కుల కార్యకర్తలను నిర్బంధిస్తున్న మోడీ సర్కార్ వంచనను అడుగడుగునా నిలదీయాలి. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగం భారత పౌరులకు ప్రసాదించిన హక్కులను కాపాడుకోవాలి.


మహనీయుని మాట



చదువుసంధ్యలు సామాన్య ప్రజల్లోకి ఎంతగా చొచ్చుకొని పోతాయో... అంతగా ఆ దేశం అభివృద్ధి చెందుతుంది.
- స్వామి వివేకానంద

కామెంట్

ఇడబ్ల్యుఎస్ ప్రమాణాలను సవరించాలి



శతాబ్దాల తరబడి అణచివేతకు గురైన కుల వ్యవస్థ ఆధారంగా, 'సామాజికంగా, విద్యా పరంగా' వెనుకబడిన కులాలకు రిజర్వేషన్‌ను సమర్థిస్తూనే అన్ని కులాలు, కమ్యూనిటీలకు చెందిన నిరుపేదలను, కార్మికులను సమైక్యం చేయడానికి సిపిఎం కృషి చేస్తోంది. ప్రస్తుతమున్న దోపిడీతో కూడిన సామాజిక, ఆర్థిక వ్యవస్థతో పోరాడేందుకు ఇదొక మార్గం. విభేదాలను అధిగమించేందుకు, అన్ని కులాలకు చెందిన నిరుపేద వర్గాల ఐక్యత కోసం జనరల్ కేటగిరీలోనే నిరుపేద వర్గాలకు కొంత మొత్తంలో రిజర్వేషన్ కల్పించాలని సిపిఎం వాదించింది. సహజంగానే ఒబిసిల, ఎస్‌సి, ఎస్‌టిల ప్రస్తుత కోటా శాతాన్ని ఇది దెబ్బతీయలేదు.

జనరల్ కేటగిరీ పరిధిలోనే ఆర్థికంగా బలహీన వర్గాలకు (ఇడబ్ల్యుఎస్) రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకువచ్చిన 103వ రాజ్యాంగ సవరణ చెల్లుబాటును ఇటీవల సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం 3-2 ఓట్ల తేడాతో సమర్థించింది. 2019 జనవరిలో పార్లమెంట్‌లో తీసుకు వచ్చిన ఈ రాజ్యాంగ సవరణకు సిపిఎం మద్దతిచ్చింది.

జనరల్ కేటగిరీలో ఇడబ్ల్యుఎస్‌కు గరిష్ఠంగా 10 శాతం వరకు రిజర్వేషన్‌కు ఈ సవరణ వీలు కల్పించింది. అంటే, వెనుకబడిన తరగతులు, ఎస్‌సి, ఎస్‌టి కేటగిరీల్లోకి రానివారికి ఇది వర్తిస్తుంది.

ఒబిసి రిజర్వేషన్ల కోసం 1990లో మండల్ కమిషన్ చేసిన సిఫార్సుల అమలు సమయంలో జనరల్ కేటగిరీకి చెందిన పేదలకు కూడా కొంత మొత్తంలో రిజర్వేషన్ వుండాలన్న నిబంధనను సిపిఎం లేవనెత్తింది.

ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్‌కు సిపిఎం పూర్తిగా మద్దతిస్తూనే, జనరల్ కేటగిరీలోని నిరుపేద వర్గాలకు ఆర్థిక ప్రామాణికతపై కొంత కోటా వుండాలని డిమాండ్ చేసింది. ఇటువంటి నిబంధన తీసుకురావడం వల్ల, రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలతో చోటు చేసుకునే తీవ్రమైన అభిప్రాయ బేధాలు, చీలికలనేవి కొంతవరకు తగ్గుతాయని పార్టీ అభిప్రాయపడింది. వర్గ దృక్పథాన్ని కలిగిన పార్టీ, ఒబిసి కోటాలోనే ఆర్థిక ప్రామాణికాలు వుండాలని కూడా భావిస్తోంది. తద్వారా ఈ వర్గాలకు చెందినవారిలో నిజంగా అర్హులైన వారు ఆ కోటాను ఉపయోగించుకుంటారని అభిప్రాయపడింది. అనంతర కాలంలో 'క్రీమీ లేయర్' రూపంలో సుప్రీం కోర్టు దీన్ని ఆమోదించింది.

శతాబ్దాల తరబడి అణచివేతకు గురైన కుల వ్యవస్థ ఆధారంగా, 'సామాజికంగా, విద్యా పరంగా' వెనుకబడిన కులాలకు రిజర్వేషన్‌ను సమర్థిస్తూనే అన్ని కులాలు, కమ్యూనిటీలకు చెందిన నిరుపేదలను, కార్మికులను సమైక్యం చేయడానికి సిపిఎం కృషి చేస్తోంది. ప్రస్తుతమున్న దోపిడీతో కూడిన సామాజిక, ఆర్థిక వ్యవస్థతో పోరాడేందుకు ఇదొక మార్గం. విభేదాలను అధిగమించేందుకు, అన్ని కులాలకు చెందిన నిరుపేద వర్గాల ఐక్యత కోసం జనరల్ కేటగిరీలోనే నిరుపేద వర్గాలకు కొంత మొత్తంలో రిజర్వేషన్ కల్పించాలని సిపిఎం వాదించింది. సహజంగానే ఒబిసిల, ఎస్‌సి, ఎస్‌టిల ప్రస్తుత కోటా శాతాన్ని ఇది దెబ్బతీయలేదు. ప్రస్తుతమున్న రిజర్వ్‌డ్ కోటాలను ఉపయోగించుకోలేని అన్ని మతపరమైన గ్రూపులు, కమ్యూనిటీలను కలుపుకుని వుండే జనరల్ కేటగిరీ నుండే ఇడబ్ల్యుఎస్ కోటా రూపొందింది.

అయితే, ఇడబ్ల్యుఎస్ కిందకు ఎవరు వస్తారనేది నిర్వచించేందుకు మోడీ ప్రభుత్వం...ఆఫీసు మెమోరాండం ద్వారా నిర్దేశించిన ప్రమాణాలను పార్టీ విమర్శించింది. విద్య, ఉద్యోగాలలో కేంద్ర ప్రభుత్వ కోటాకు ఇడబ్ల్యుఎస్ వర్తించాలంటే సదరు కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షల లోపు వుండాలి. వ్యవసాయ భూమి 5 ఎకరాలకు మించి వుండరాదు. లేదా నోటిఫైడ్ మున్సిపాలిటీలో వెయ్యి చదరపు అడుగుల నివాస ప్రాంతం లేదా వంద చదరపు గజాల స్థలం వుండరాదు. అంటే దీనర్థం నిరుపేదలు కానివారు ఇడబ్ల్యుఎస్ కోటాను ఉపయోగించుకోలేరు. ఆదాయ పన్ను మినహాయింపునకు పరిమితి ఏడాదికి రూ.2.5 లక్షలుగా వుంది. అది దాటితే ఎవరైనా ఆదాయపన్ను చెల్లించాల్సిందే. అలాగే ఐదెకరాల స్వంత వ్యవసాయ భూమి వుంటే వారు పేదలు కాదు.

ఆ రకంగా, ఈ పరిమితి హద్దులు చాలా ఎక్కువగా, విస్తృతంగా వుంచడం వల్ల ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ ప్రయోజనం నెరవేరదు. ఈ ఆఫీసు మెమోరాండాన్ని సవాలు చేస్తూ పిటిషన్లు దాఖలవడంతో సుప్రీం కోర్టు ఇంకా ఈ విషయంపై పరిశీలన జరపాల్సి వుంది.

రాష్ట్ర స్థాయి ఉద్యోగాలు, చదువు కోసం ఇడబ్ల్యుఎస్ కోటా వర్తింపును రాష్ట్రాలకు విడిచిపెట్టబడింది. ఇడబ్ల్యుఎస్ ప్రామాణికాలు, ఎంతవరకు కోటా ఇవ్వవచ్చనే అంశాన్ని నిర్ణయించేందుకు కేరళ లోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఏడాదికి రూ.4 లక్షల కంటే తక్కువ కుటుంబ ఆదాయం కలిగినవారు, రెండున్నర ఎకరాలను మించి వ్యవసాయ భూమి లేని కుటుంబాలు ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌కు అర్హులని జస్టిస్ శశిధరన్ నాయర్ కమిషన్ సిఫార్సు చేసింది.

2020లో కేరళ మంత్రివర్గం ఈ సిఫార్సులను ఆమోదించింది. ప్రస్తుతం కేరళలో విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్ అమలవుతోంది. జనరల్ కోటా లోని నిరుపేద వర్గాలను ఉద్దేశిస్తూ ఇడబ్ల్యుఎస్‌ను నిర్వచించేందుకు ప్రామాణికాలను ఆమోదించారు.

వాస్తవానికి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఈ కోటా ప్రయోజనాలు అందాలనుకుంటే... ఇడబ్ల్యుఎస్‌ను నిర్వచించే ప్రమాణాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే సవరించాలి.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

★

సందర్భం

అఖిల భారత కిసాన్‌సభ 35వ జాతీయ మహాసభ డిసెంబరు 13 నుండి 16వ తేదీ వరకు కేరళ లోని త్రిసూర్‌లో జరగనుంది. మహాసభ సన్నాహాలలో భాగంగా నవంబరు 15న గ్రామ గ్రామాన కిసాన్‌సభ పతాకావిష్కరణ చేయాలని అఖిల భారత కిసాన్ సభ పిలుపు ఇచ్చింది. నవంబరు 15 స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన నాయకుడు బిర్సా ముండా జయంతి. ఆ రోజున దేశవ్యాపితంగా లక్ష గ్రామాలలో కిసాన్ సభ జెండా ఎగురవేయాలని కిసాన్ సభ నిర్ణయించింది.

బిర్సా ముండా నేటి జార్ఖండ్ రాష్ట్రంలోని ఉలిహాతు గ్రామంలో జన్మించాడు. 25 సంవత్సరాల వయస్సులోనే రాంచీ సెంట్రల్ జైల్‌లో మరణించాడు. ఆనాటి బ్రిటీష్ పాలకులు గిరిజనుల భూములను అక్రమంగా స్వాధీనం చేసుకోవడానికి నిరసనగా గెరిల్లా పోరాటం సాగింది. ఆ పోరాటానికి నాయకుడు బిర్సా ముండా. 1899లో క్రిస్మస్ రోజున 7 వేల మందితో సభ జరిపాడు. ఉల్‌గులాన్ ఉద్యమానికి పిలుపు ఇవ్వడమేగాక...గెరిల్లా సైన్యాన్ని ఏర్పరిచాడు. అనతి కాలంలోనే ఉద్యమం కుంతి, తామర్, బసియా, రాంచీ జిల్లాలకు వ్యాపించింది. నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో పోరాటాలు సాగాయి. 1900 మార్చి 3న గెరిల్లా దళం నిద్రిస్తుండగా బిర్సా ముండా తో సహా 460 మందిని అరెస్టు చేసి రాంచీ జైలులో బంధించారు. 1900 జూన్ 9న బిర్సా ముండా జైలులో మృతి చెందాడు. ఆయన జయంతి రోజైన నవంబరు 9న పతాకావిష్కరణ జరపాలని అఖిల భారత కిసాన్ సభ పిలుపు ఇచ్చింది.



వై.కేశవరావు

గ్రామ గ్రామాన రైతుసంఘం పతాకావిష్కరణ



డిసెంబరులో జరగనున్న 35వ అఖిల భారత రైతు మహాసభకు ప్రత్యేకత ఉంది. ఈ కాలంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 380 రోజుల పాటు సుదీర్ఘ పోరాటం సాగింది. కేంద్ర ప్రభుత్వం కల్పించిన సామ, దాన, బేధ దోండోపాయాలన్నిటినీ అధిగమించి ఐక్యంగా సాగింది. చివరకు కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ శక్తుల ప్రయోజనాల కోసం అప్రజాస్వామికంగా తెచ్చిన మూడు నల్ల చట్టాలను ఉపసంహరించుకునేంత వరకు సాగిన చారిత్రాత్మక పోరాటమిది. ఇందులో అఖిల భారత కిసాన్ సభ క్రియాశీలక పాత్ర పోషించింది. పోరాటాన్ని దేశ వ్యాపితంగా విస్తరించడంలో ప్రధాన పాత్ర వహించింది. రైతాంగ పోరాటానికి కార్మిక వర్గ, ఇతర ప్రజానీక మద్దతును కూడగట్టడంలో ప్రధాన భూమిక వహించింది.

ఈ మహాసభకు మరో ప్రత్యేకత కూడా ఉంది. పంటల మద్దతు ధరల చట్టం తెస్తామని, విద్యుత్ చట్ట సవరణ బిల్లులో వ్యవసాయానికి మినహాయింపు ఇస్తామని, ఉద్యమం సందర్భంగా 48 వేల మంది రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేస్తామని ఉద్యమం విరమణ సమయంలో నాయకత్వానికి కేంద్ర ప్రభుత్వం రాతపూర్వక హామీ ఇచ్చింది. అయితే ప్రభుత్వం ఆ హామీలను అమలు చేయకుండా మోసం చేసింది. విద్యుత్ చట్ట సవరణ బిల్లును యథాతథంగా పార్లమెంటు ముందు పెట్టింది. పంటల మద్దతు ధరల చట్టం ఊసే లేకుండా బూటకపు కమిటీని ఏర్పాటు చేసింది. సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వం తిరిగి మరొక ఉద్యమానికి సమాయత్తం అవుతున్నది. పోరాట రూపాలను, డిమాండ్లను రూపొందించే పనిలో ఉంది.

అఖల భారత కిసాన్ సభ గ్రామ, మండల, జిల్లా రాష్ట్ర మహాసభలలో చర్చించి జాతీయ మహాసభకు సిద్ధం అవుతున్నది. మొదటి నుండి రైతుసంఘాలు కోరుతున్నట్లుగా స్వామినాథన్ సూచించిన సి2+50 శాతం ఫార్ములా ప్రకారం పంటల మద్దతు ధరలు, వాటి అమలుకు సమగ్ర చట్టం, అప్పులపాలైన రైతాంగ రుణాలు మాఫీ, కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టాలు... సాధించుకోవలసి ఉంది. విద్యుత్ చట్ట సవరణ బిల్లును వెనక్కి కొట్టవలసి ఉంది. వీటన్నిటిని చర్చించి ఈ మహాసభ దిశానిర్దేశం చేస్తుంది. రాబోయే పోరాటాలకు సమాయత్తం చేయవలసి ఉంది. ఈ మహాసభ సందర్భాన్ని పురస్కరించుకుని 'ప్రత్యామ్నాయం కోసం పోరాడండి. సంఘటితం చేయండి. ముందుకు సాగండి' అనే నినాదంతో లక్ష గ్రామాలలో నవంబరు 15న పతాకావిష్కరణ చేయాలని పిలుపు ఇచ్చింది. ఈ పిలుపును అనుసరించి రైతుసంఘం ఉన్న ప్రతి గ్రామంలో సంఘం జెండా ఎగురవేయాలి.


/వ్యాసకర్త : ఎ.పి రైతుసంఘం సీనియర్ నాయకులు/

★

సెటైర్

పిలవని పేరంటం

సుబ్రమణ్యం



విభజన చట్టం ప్రకారం కేంద్రం నెరవేర్చవలసినవి బాధ్యతలు. అవి రాష్ట్రానికి కేంద్రం దయదలిచి ఇచ్చే వరాలు కావు. రాష్ట్ర ప్రజలకి సంక్రమించిన హక్కులు. వాటిలో ఏ ఒక్కదానినైనా సవ్యంగా, నిజాయితీగా కేంద్రం అమలు చేసిందా అంటే అదీ లేదు. పోలవరం విషయంలో గాని, రైల్వే జోన్ విషయంలోగాని కేంద్రం ఆడుతున్న నాటకం చూస్తూనే వున్నాం. ఇవన్నీ చాలవన్నట్టు ఇప్పుడు రాష్ట్ర ప్రజలు పట్టుబట్టి పోరాడి సాధించుకున్న విలువైన సంపదలను కాజేసే పనిలో తలమునకలైవున్నారు. గంగవరం పోర్టు, కృష్ణపట్నం పోర్టు అదానీ చేతుల్లోకి పోయాయి. ఇప్పుడు విశాఖ ఉక్కు మీద పడ్డారు. కార్పొరేట్ల దాహానికీ అందు లేదు, మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న ద్రోహానికీ అంతు లేదు.

సాధారణంగా మనం మన ఇంటికి కొందరు బంధువులు వస్తే బాగుంటుందని అనుకుంటాం. వాళ్ళ రాక మనకి ఆనందాన్ని కలిగిస్తుంది. వాళ్ళు కూడా మన ఇంటికి వచ్చేటప్పుడు మనకి ఆనందాన్ని, సౌకర్యాన్ని, సంతృప్తిని కలిగించే విషయాలు ఏమిటి? అన్నది కాస్తంత ముందుగానే ఆలోచించుకుని వస్తారు. వాళ్ళు రాగానే మన ఇంట్లోని పిల్లలు చుట్టూ చేరి "నాకేం తెచ్చావు మావయ్యా?" అనో, "నేను గతంలో చెప్పింది గుర్తుందా బాబాయ్?" అనో, "బలే ! బలే ! మా తాతయ్య నాకు ఫలానా డ్రస్సు తెచ్చాడోచ్!" అనో కేరింతలు కొడుతూ సంబరపడతారు.

కాని అందరు బంధువుల విషయమూ అటువంటిదిగానే ఉంటుందా? కొందరు మహానుభావులు ఉంటారు. వాళ్ళు మన ఇళ్ళకి రాకుండా ఉంటేనే బాగుంటుందని మనం అనుకుంటూ వుంటాం. మనం పిలవకపోయినా వాళ్ళే వచ్చేస్తూ వుంటారు. ఆ తరహా బంధువులు వచ్చి వెళ్ళాక మన కుటుంబ సభ్యుల్లోనే తగువులు బయలుదేరుతాయి. భార్య మీద భర్తకో, లేకపోతే భర్త మీద భార్యకో, కాకపోతే తండ్రి మీద పిల్లలకో అసంతృప్తులు తలెత్తుతాయి. కాస్తంత తమాయించుకుని, "ఇన్నాళ్ళూ లేని ఈ తగువులు, అసంతృప్తులు ఇప్పుడే ఎందుకొచ్చాయి?" అని గనుక ఆలోచించుకుంటే ఆ తగువులకి మూల కారణం మన ఇంటికి వచ్చి వెళ్ళిన మహానుభావుడే అని బోధపడుతుంది.

ఈ సోది అంతా ఇప్పుడెందుకు చెప్తున్నానంటారా? మన రాష్ట్రం కూడా ఒక కుటుంబం లాంటిదే కదా. మన రాష్ట్రానికి కేంద్రం నుండి అతిథులు రావడం, పోవడం జరుగుతోంది కదా. ఈ మధ్యనే మన ఆడపడుచు (అని మన తెలుగు అన్నలు పార్టీలకు అతీతంగా సంబరపడిపోతూంటారు) నిర్మలమ్మ వచ్చి వెళ్ళారు. ఇప్పుడు అందరికన్నా విశిష్ట అతిథి మోడీజీ విచ్చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయనగారి విశాఖ పర్యటనను చాలా గొప్పగా నిర్వహించాలని సకల ప్రయత్నాలూ చేయడంలో తలమునకలై వుంది. మరి విశాఖకు వచ్చిన మన విశిష్ట అతిథి ఏకోవకు చెందుతారు? మనం సంబర పడదామా? లేకపోతే జాగ్రత్త పడదామా? ఆయనగారు మన రాష్ట్రానికి ఏదన్నా ఉపకారం చేసే రకమా? లేకపోతే తగువులు రేపెట్టి చంకలు గుద్దుకునే రకమా?

ఆ పెద్దమనిషి తిరుపతి బహిరంగ సభలో 2014 ఎన్నికల సందర్భంలో చాలా గట్టిగా చెప్పిన విషయం ఏమిటి? గుర్తుందా? "మమ్మల్ని (అంటే బిజెపిని, మిత్రపక్షంగా అప్పుడు ఉండిన టిడిపి ని) గెలిపిస్తే ఆంధ్రప్రదేశ్ కి పదేళ్ళ పాటు ప్రత్యేక హోదా ఇస్తాం" అన్నారు. ఆ పదేళ్ళూ పూర్తి కావస్తున్నాయే తప్ప ప్రత్యేక హోదా సంగతి ఏమైంది? నీతి ఆయోగ్ అడ్డం పడిందని ఒకసారి, ఆంధ్ర ప్రదేశ్ కి ఇస్తే ఇంకా చాలా రాష్ట్రాలు అడుగుతాయని ఇంకోసారి, ప్రత్యేక హోదా కాదు, ప్రత్యేక ప్యాకేజి ఇస్తామని మరోసారి ఇలా నానా రకాలుగా సాకులు చెప్తూ కాలక్షేపం చేస్తున్నారు. అసలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను రెండుగా విడగొట్టాలని, ఒక ఓటు, రెండు రాష్ట్రాలు అని అందరికన్నా మొదట కాకినాడలో తీర్మానం చేసిందే ఈ బిజెపి. అంటే చీలిక తగువు ఆ పార్టీ పుణ్యమే. రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచండి మొర్రో అని మనం ఎంత మొత్తుకున్నా, పార్లమెంటులో విభజన చట్టం ఆమోదం పొందగలిగిందీ అంటే అందుకు బిజెపి ఇచ్చిన పూర్తి మద్దతు కారణం కాదా? ఆ సందర్భంగానే కదా ప్రత్యేక హోదా ప్రస్తావన వచ్చింది? దానిని మొదట రేపింది ఎవరు ? ఈ బిజెపినే కదా ? అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఐదేళ్ళ పాటు ప్రత్యే హోదా ఇస్తామని అంటే "కాదు, కాదు, పదేళ్ళు ఇవ్వాలని" పట్టుబట్టింది ఈ బిజెపినే కదా? ఎన్నికల ముందు మరోసారి ఆ విషయంలో హామీ ఇచ్చిందీ బిజెపినే కదా? తీరా గద్దె మీద కూచున్నాక మాట మార్చి మొండి చెయ్యి చూపించిందీ బిజెపినే కదా ?

విచిత్రం ఏమంటే ఈ రాష్ట్రంలో ప్రధాన పార్టీలు రెండూ ఆ ఊసు ఎత్తకుండా "వ్యూహాత్మకంగా" మౌనం వహిస్తున్నారు. పైగా ఒకరితో మరొకరు పోటీ పడుతూ ఆ బిజెపి పల్లకీ మోయడానికి నానా తంటాలూ పడుతున్నారు. "సిరి అబ్బలేదు కాని చీడ పట్టుకుంది" అన్న చందాన మనకి తగువులు మిగిలాయి. రాష్ట్రపతి ఎన్నికల్లో ఆ బిజెపికి మాత్రం వందకి వంద శాతం ఓట్లూ మన రాష్ట్రం నుండి పడ్డాయి.

మన విశిష్ట అతిథి గారు మళ్ళీ మరోసారి అమరావతి రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి వచ్చారు. విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణం కేంద్ర ప్రభుత్వపు బాధ్యత. కాబట్టి శంకుస్థాపన చేయడానికి వచ్చిన పెద్దమనిషి ఆ నిర్మాణబాధ్యత తామే చేపడతామని ప్రకటించి ఎంతో కొంత నిధులను గ్రాంటు చేస్తాడని అందరమూ అనుకున్నాం. కాని అప్పుడేం ఇచ్చాడో మనకి తెలుసు కదా ? ముంతడు నీళ్ళూ, పిడికెడు మట్టీ.

మళ్ళీ ఇక్కడా విచిత్రమే. మన ఇద్దరు ప్రధాన ప్రాంతీయ వీరులూ విభజన చట్టం ప్రకారం రాజధానిని నిర్మించడానికి బాధ్యత ఎందుకు తీసుకోలేదని కేంద్రాన్ని అడగడం లేదు. విభజన తర్వాత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ళపాటూ ఆయన సింగపూర్ చుట్టూ, భ్రమరావతి చుట్టూ తన ప్రచారార్భాటాన్నంతా తిప్పారు. ఆ భ్రమల్లో శలభాల్లా చిక్కుకున్న రైతుల నుండి వేలాది ఎకరాలను సేకరించారు. రాజధాని నిర్మాణం పట్ల ప్రధాన బాధ్యత ఉన్న కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ హడావుడి జరుగుతున్నంతసేపూ నోరు మెదపనే లేదు.

ప్రభుత్వం మారి జగనన్న వచ్చాక రాజధాని సీన్ మారిపోయింది. ఒక రాజధాని కాస్తా ఇప్పుడు మూడు రాజధానులైపోయింది! అమరావతే అభివృద్ధికి మార్గం అని టిడిపి, మూడు రాజధానులతోటే అభివృద్ధి అని వైసిపి రాష్ట్రంలో రచ్చ రచ్చ చేస్తున్నాయి. అభివృద్ధేమో అటకెక్కింది. రాజధాని నిర్మాణానికి ప్రధాన బాధ్యత వహించాల్సిన బిజెపి మాత్రం మహదానందంగా, "రెండు పిల్లులూ-రొట్టె-కోతి" కథలో కోతి పాత్రను యధోచితంగా పోషిస్తోంది. మోడీ శంకుస్థాపనతో మొదలైన యవ్వారం ఇన్నాళ్ళ తర్వాత ఇక్కడిదాకా తెచ్చింది. శంకుస్థాపన నాడే "రాజధాని నిర్మాణం బాధ్యత నాది" అని స్పష్టంగా మోడీ ప్రకటించి, ఆ బాధ్యతను సవ్యంగా నిర్వర్తించివుంటే ఇన్నేళ్ళపాటూ మనకి ఈ తగువులు ఉండేవా?

విభజన చట్టం ప్రకారం కేంద్రం నెరవేర్చవలసినవి బాధ్యతలు. అవి రాష్ట్రానికి కేంద్రం దయదలిచి ఇచ్చే వరాలు కావు. రాష్ట్ర ప్రజలకి సంక్రమించిన హక్కులు. వాటిలో ఏ ఒక్కదానినైనా సవ్యంగా, నిజాయితీగా కేంద్రం అమలు చేసిందా అంటే అదీ లేదు. పోలవరం విషయంలో గాని, రైల్వే జోన్ విషయంలోగాని కేంద్రం ఆడుతున్న నాటకం చూస్తూనే వున్నాం. ఇవన్నీ చాలవన్నట్టు ఇప్పుడు రాష్ట్ర ప్రజలు పట్టుబట్టి పోరాడి సాధించుకున్న విలువైన సంపదలను కాజేసే పనిలో తలమునకలైవున్నారు. గంగవరం పోర్టు, కృష్ణపట్నం పోర్టు అదానీ చేతుల్లోకి పోయాయి. ఇప్పుడు విశాఖ ఉక్కు మీద పడ్డారు. కార్పొరేట్ల దాహానికీ అందు లేదు, మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న ద్రోహానికీ అంతు లేదు.

ఇంతకీ ఇప్పుడు మోడీని రాష్ట్రానికి రమ్మనమని ఆహ్వానించింది ఎవరు? మోడీ విశాఖలో ప్రారంభించబోతున్నవన్నీ కేంద్రం పరిధి లోని అంశాలే. మనం అడిగినవి, కోరుకున్నవి ఏవీ వాటిలో లేవు. "కట్టుకోడానికి గుడ్డలు లేవురా బాబూ" అంటే "ముక్కు తుడుచుకోడానికి ఈ పీలిక ఉంచుకో" అని దానం చేసినట్టు ఉన్నాయి అవి.

మరి ఈ మాత్రం దానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని పర్యటన ఏర్పాట్లలో తలమునకలైపోయి, ఆంధ్రా యూనివర్సిటీలో చెట్లు కూల్చేసి, పెదవాల్తేరు లో అధికారికంగా, కోర్టు ఉత్తర్వుల ప్రకారం కొనసాగుతున్న చిన్న, చితకా దుకాణాలని కూలగొట్టేసి, నానా హడావుడీ చేయడమెందుకో! మోడీ వస్తున్న సందర్భంగా ఎవరూ ఏవిధమైన నిరసనలూ చేపట్టకూడదని ముందస్తుగా నోటీసులు పంపడం దేనికో! అంటే, మోడీజీకి విశాఖలో ఎదురయేవి నిరసనలే అని ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ముందుగానే బోధపడిపోయిందన్నమాట.

సందట్లో సడేమియా అన్నట్టు 'మోడీ విశాఖ వచ్చినంత మాత్రాన మా పార్టీ వైసిపి తో జత కడుతుందని ఎవరూ ఆందోళన పడకండి' అంటూ పరోక్షంగా జనసేనానికి, చంద్రబాబుకు సంకేతాలు పంపుతున్నారు రాష్ట్ర బిజెపి నాయకులు.

"కనీసం ఇప్పుడైనా విభజన హామీలనన్నింటినీ అమలు చేయడానికి ఆదేశాలు ఇవ్వండి. విశాఖ ఉక్కును అమ్మేది లేదని ప్రకటించండి" అని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అధికారికంగా ఒక ప్రకటననైనా ఇచ్చే ధైర్యం ఈ జగన్ ప్రభుత్వానికి ఉందా? పోనీ, జగన్ ప్రభుత్వాన్ని నిత్యం దుమ్మెత్తిపోసే చంద్రబాబు కి కాని, పవన్ కల్యాణ్ కి కాని ఈ విషయాలపై మోడీని నిలదీసే సత్తా ఉందా?

జంతుశాస్త్రంలో "వెన్నెముక లేని జీవుల" గురించి చదువుకున్నాం. ఇప్పుడు ఆ తరహా జీవులు రాష్ట్ర రాజకీయాల్లో ఆడుతున్న డ్రామాలు చూస్తున్నాం. కనీసం మన వెన్నెముకలనైనా కాస్తంత నిటారుగా నిలబెడదామా ?

★

'జ్ఞానవాపి శివలింగం' రక్షణ పొడిగింపు

న్యూఢిల్లీ : వారణాసిలో జ్ఞానవాపి మసీదులో శివలింగం కనిపించిందంటున్న ప్రాంతానికి రక్షణను పొడిగిస్తూ సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది. రక్షణను కల్పించాలంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. మే నెలలో జారీ చేసిన ఆదేశాలు శనివారంతో ముగియనున్న నేపథ్యంలో తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశించింది. కాశీ విశ్వనాథ్ ఆలయానికి సమీపంలో ఉన్న జ్ఞానవాపి మసీదులో శివలింగం కనిపించిందంటున్న ప్రాంతానికి రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు మే నెలలో వారణాసి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఆ ప్రార్థనా స్థలంలో ముస్లింలు నమాజ్ చేసుకోవడానికి, మతపరమైన ఆచారాలు పాటించడానికి అనుమతినిచ్చింది. అయితే ఈ కేసుపై వారణాసి కోర్టులో జరుగుతున్న విచారణపై స్టే విధించడానికి మాత్రం సుప్రీంకోర్టు నిరాకరించిన సంగతి తెలిసిందే.

త్వరలో ఆన్‌లైన్ ఆర్‌టిఐ పోర్టల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సమాచార హక్కు (ఆర్‌టిఐ) దరఖాస్తులను దాఖలు చేయడానికి ఆన్‌లైన్ పోర్టల్‌ని త్వరలో ప్రారంభిస్తామని సుప్రీం కోర్టు తెలిపింది. ఆర్‌టిఐ దరఖాస్తులు, అప్పీళ్ల ఈ ఫైలింగ్ కోసం సుప్రీం కోర్టుకు ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ న్యాయ విద్యార్థులు అకృతి అగర్వాల్, లక్ష్య పురోహిత్ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ హిమా కోహ్లీలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషన్ వాదనలు వినిపించారు. వెబ్‌సైట్ సిద్ధంగా ఉందని, ఎప్పుడైనా ప్రారంభించడం జరుగుతోందని సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ తెలిపారు. దీంతో పిటిషనర్ ఫిర్యాదు తీర్చినట్లేనని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌గా మారితే మన జీవితాలను కూడా సులభతరం చేస్తుందని, దీన్ని చేయాలని హైకోర్టులను కూడా ఒత్తిడి చేస్తామని చెప్పారు. న్యాయస్థానాల గురించి సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి సుప్రీం కోర్టు నిర్దేశించిన యంత్రాంగాన్ని అనుసరించాలని కోరుతూ హైకోర్టులకు లేఖ రాస్తానని తెలిపారు.

మెక్సికో బార్‌పై దాడి

- తొమ్మిది మంది హత్య

సెలయా, మెక్సికో : సెంట్రల్ మెక్సికన్ రాష్ట్రమైన గుయానజుయాటోలోని ఒక బార్‌లో సాయుధ వ్యక్తులు కొందరు 9మందిని హతమార్చారని స్థానిక అధికారులు తెలిపారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించి ఈ దాడి జరిగినట్లుగా భావిస్తున్నారు. ఈ ఘటనలో మరో ఇద్దరు గాయపడ్డారు. బుధవారం రాత్రి 9గంటల సమయంలో ఈ దాడి చోటు చేసుకుంది. ఒక ట్రక్కులో వచ్చిన సాయుధులు కొందరు లెక్సస్ బార్‌కు చేరుకుని లోపల వున్న వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారని స్థానిక మున్సిపాలిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మరణించిన వారిలో ఐదుగురు పురుషులు, నలుగురు మహిళలు వున్నారు. ఈ ఘటనకు సంబంధించి సాక్షులెవరైనా వుంటే వారు అజ్ఞాతంగా సాక్ష్యమివ్వచ్చని అధికారులు కోరారు.

తమిళనాడులోని ఆరు జిల్లాలకు రెడ్‌ఎలెర్ట్

చెన్నై : తమిళనాడులోని ఆరు జిల్లాలకు ప్రాంతీయ వాతావరణ కేంద్రం శుక్రవారం రెడ్ ఎలెర్ట్ జారీ చేసింది. కడ్డలోర్, మయిలాతుథురై, తంజావూర్, తిరువరూర్, నాగపట్టినం, కరైకల్ జిల్లాలో రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అలాగే, తిరువల్లూర్, కాంచీపూరం, రాణిపేట్ జిల్లాలకు అంతకు ముందు జారీ చేసిన రెడ్ ఎలెర్ట్ హెచ్చరికల్ని ఉపసంహరించుకుంది. శ్రీలంకు సమీపంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతారవణ కేంద్రం తెలిపింది.కాగా, శుక్రవారం కూడా రాజధాని చెన్నైతో పాటు అనేక జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. రోడ్లపైకి నీరు చేరుకోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. మూడు జిల్లాలో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు.

జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో కొలీజియం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ ఆధ్వర్యంలోని సుప్రీంకోర్టు కొలీజియంలో 2023 మే 15 వరకు ఆరుగురు న్యాయమూర్తులు ఉంటారు. సిజెఐ జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు కొలీజియంలో న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్, జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సంజీవ్ ఖన్నా ఉంటారు. సిజెఐ జస్టిస్ చంద్రచూడ్ తరువాత జస్టిస్ సంజీవ్ ఖన్నా సిజెఐ అవుతారు. ఐదుగురు సభ్యుల కొలీజియంలో ఆయన లేరు. సిజెఐ చంద్రచూడ్ కాకుండా మిగిలిన నలుగురు సభ్యులు సిజెఐ కాలేరు. కొలీజియంలో తప్పనిసరిగా తరువాత సిజెఐ అయ్యే సభ్యులు ఉండాలి. అందువల్ల కొలిజియంలో ఆరో సభ్యునిగా జస్టిస్ సంజీవ్ ఖన్నాను తీసుకున్నారు. 2023 మే 15న జస్టిస్ ఎంఆర్ షా పదవీ విరమణ తరువాత కొలీజియం దాని సాధారణ సంఖ్య ఐదుకి తిరిగి వస్తుంది. గతంలో మూడేళ్ల 117 రోజుల సుదీర్ఘ పదవీకాలంలో ఉన్న 37వ సిజెఐ జస్టిస్ కెజి బాలకృష్ణన్ హయంలోనూ ఇలానే జరిగింది. సిజెఐ జస్టిస్ చంద్రచూడ్ పదవీకాలం సుదీర్ఘంగా ఉన్నందున కొలీజియం కూర్పులో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి.

హిమాచల్, గుజరాత్‌ల్లో

రికార్డు స్థాయిలో ప్రలోభాలు

- మద్యం నిషేధం ఉన్న గుజరాత్‌లో లక్ష లీటర్ల మద్యం,రూ.71.88 కోట్లు
- హిమాచల్‌లో రూ.27.21 కోట్లు
- కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో రికార్డు స్థాయిల్లో నగదు, మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులు పట్టుకున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. 1962 నుంచి మద్యం నిషేధం అమల్లో ఉన్న గుజరాత్‌లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై ఎనిమిది రోజుల్లోనే లక్షల లీటర్ల మద్యం దొరకడం గమనార్హం. ఈ మేరకు శుక్రవారం ఈసిఐ ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ప్రకటన వెలువడిన కొద్ది రోజుల్లోనే గుజరాత్‌లో రూ.71.88 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులు పట్టుకున్నట్లు తెలిపారు. గత 2017 ఎన్నికల్లో (రూ.27.21 కోట్లు) కంటే ఇది అత్యధికమని పేర్కొన్నారు. అదేవిధంగా, హిమాచల్ ప్రదేశ్‌లో కూడా 2017లో రూ. 9.03 కోట్లతో పోలిస్తే, జప్తులు ఐదు రెట్లు పెరిగి, ఈసారి రూ. 50.28 కోట్ల విలువైన జప్తులు జరిగాయని తెలిపింది. ఆ రెండు రాష్ట్రాల్లో ఈ నెల 10 వరకు నగదు, మద్యం, డ్రగ్స్, ఉచితాలు వంటి వివరాలు ఇలా ఉన్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో రూ.17.18 కోట్ల నగదు, రూ.17.50 కోట్ల విలువ చేసే 9,72,818.24 లీటర్ల మద్యం, రూ.1.20 కోట్ల విలువ చేసే డ్రగ్స్, రూ.13.99 కోట్ల విలువ చేసే విలువైన లోహాలు, రూ.41 లక్షల విలువ చేసే ఉచితాలు, మొత్తం రూ.50.28 కోట్ల విలువైన జప్తులు చేసినట్లు తెలిపారు. అలాగే గుజరాత్‌లో రూ.66 లక్షల నగదు, రూ.3.86 కోట్ల విలువ చేసే 1,091,189.19 లీటర్ల మద్యం, రూ.94 లక్షల విలువ చేసే డ్రగ్స్, రూ.1.86 కోట్ల విలువ చేసే విలువైన లోహాలు, రూ.64.56 కోట్ల విలువ చేసే ఉచితాలు, మొత్తం రూ.71.88 కోట్ల విలువైన జప్తులు చేసినట్లు వివరించారు. ముంద్రా పోర్టులో వీటిని పట్టుకున్నట్లు తెలిపారు.

నేడు హిమాచల్ పోలింగ్

- 68 స్థానాలకు ఒకే దశ
- ఓటర్లు 55,74,793, పోలింగ్ స్టేషన్లు 7,881

హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు శనివారం జరగనున్నాయి. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం 68 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది. మొత్తం ఓటర్ల సంఖ్య 55,74,793, అందులో 18 ఏళ్ల నిండిన తొలిసారి ఓటు హక్కు పొందిన ఓటర్లు 43,173 మంది ఉన్నారు. 80 ఏళ్ల వయసు పైబడిన ఓటర్ల సంఖ్య 1,22,093, వికలాంగు ఓటర్ల సంఖ్య 56,001, థర్డ్ జండర్ ఓటర్ల సంఖ్య 37 అని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న 80 ఏళ్ళ వయసు పైబడినవారు, అదేవిధంగా 40 శాతం పైబడిన అంగవైకల్యం గలవారు తమ ఇంటి వద్ద నుంచే ఇప్పటికే ఓటు హక్కును వినియోగించుకున్నారు. దరఖాస్తు చేసుకోలేని వృద్ధులకు, వికలాంగులకు పోలింగ్ స్టేషన్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఓటు వేసేందుకు ఏర్పాటు చేశారు.

రాష్ట్రంలో ఉన్న 68 శాసన సభ స్థానాల్లో 17 ఎస్‌సి, 3 ఎస్‌టి రిజర్వ్ స్థానాలు ఉన్నాయి. దాదాపు 1500 ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 7,881 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి 24 మంది మహిళలు సహా మొత్తం 412 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. రాష్ట్రంలో 157 మహిళా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇక్కడ పోలింగ్ అధికారులు, సిబ్బంది, భద్రతా సిబ్బంది మహిళలే ఉంటారని ప్రధాన ఎన్నికల అధికారి మనీష్ గార్గ్ తెలిపారు. బిజెపి, కాంగ్రెస్‌లు మొత్తం 68 స్థానాల్లో పోటీ చేస్తుండగా, ఆప్ 67 స్థానాల్లో తమ అభ్యర్థులను నిలబెట్టింది. సిపిఎం 11 స్థానాల్లో, బిఎస్‌పి 53 స్థానాల్లో, సిపిఐ 1 స్థానాల్లో, ఇతర పార్టీలు 45 స్థానాల్లో పోటీ చేస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థులు 99 బరిలో ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాల అమలులో బిజెపి

ఆర్ఎస్‌పి 22వ జాతీయ మహాసభలు ప్రారంభం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజా వ్యతిరేక విధానాలు అమలులో నరేంద్ర మోడీ నేతత్వంలోని బిజెపి ప్రభుత్వం ముందుకు నడుస్తోందని ఆర్ఎస్‌పి జాతీయ ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య తెలిపారు. శుక్రవారం నాడిక్కడ స్థానిక కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో ఆర్ఎస్‌పి 22వ జాతీయ మహాసభలు ప్రారంభం అయ్యాయి. తొలిత ఎర్ర జెండాను ఆవిష్కరించారు. అనంతరం అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు అమరవీరుల స్థూపానికి నివాళు ర్పించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో చర్చించాల్సిన నిర్మాణ నివేదికను మనోజ్ భట్టాచార్య ప్రవేశపెట్టారు. బిజెపి ప్రభుత్వం మతోన్మాద, కార్పొరేట్ విధానాలను అవలంభిస్తోందని, దీనికోసం అన్ని సంస్థలను ఉపయోగించుకుంటుందని విమర్శించారు. నూతన విద్యా విధానంతో విద్యా వ్యవస్థనే మార్చేందుకు కుట్ర జరుగుతోందని దుయ్యబట్టారు. ఆర్ఎస్‌పి ఎంపి ఎన్‌కె ప్రేమ్ చంద్రన్, కేరళ రాష్ట్ర కార్యదర్శి శిబు బేబి జాన్, కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు అశోక్ ఘోష్, ప్రోగ్రెస్సివ్ స్టూడెంట్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి మహమ్మద్ షఫి ఉల్లా, ఏపి, తెలంగాణ నేతలు జానక రాములు, సుబ్బరాయుడు, కళ్యాణ్ చిన్నయ్య వివిధ రాష్టాల ప్రతినిధులు పాల్గొన్నారు. నేడు (శనివారం) జరిగే సభలో వామపక్ష పార్టీల నేతలు పాల్గొంటారు.

ఉక్రెయిన్ విద్యార్థులు సీట్ల వివరాలు ఇవ్వండి

- కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీం కోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉక్రెయిన్ నుంచి తిరిగి వచ్చిన వైద్య విద్యార్థులు విదేశీ వర్సిటీల్లో చేరడానికి ఎక్కడెక్కడ ఎన్ని సీట్లు ఉన్నాయో వివరాలు ఇవ్వాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆయా వర్శిటీల్లో రుసుముల వివరాలు కూడా చెప్పాలని కోరింది. దేశీయ వర్శిటీల్లో చదువుకోవడానికి అనుమతి ఇవ్వాలంటూ ఉక్రెయిన్ నుంచి తిరిగి వచ్చిన వైద్య విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపిస్తూ... ఆయా విద్యార్థులు చేరడానికి విదేశీ వర్శిటీల వివరాలు సెప్టెంబరు 15నే వెల్లడించామని తెలిపారు. నీట్ క్వాలిఫై అయినప్పటికీ దేశీయ వర్శిటీల్లో సీట్లు రాక వారంతా ఉక్రెయిన్ వెళ్లారని తెలిపారు. ఏపి, తెలంగాణ విద్యార్థుల తరపుసీనియర్ న్యాయవాది సి. మోహన్ రావు, న్యాయవాది రమేశ్ అల్లంకిలు వాదనలు వినిపిస్తూ... నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం ఒక దేశం నుంచి ఇంకో దేశానికి విద్యార్థుల ట్రాన్స్‌ఫర్ కుదరదని, అదేవిధంగా మొబిలిటీ అవకాశం కూడా లేదని తెలిపారు. 15 వర్శిటీల వివరాలు ఇచ్చినప్పటికీ మొబిలిటీ, ట్రాన్స్‌ఫర్‌లపై స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. ఉక్రెయిన్ వర్శిటీల్లోని ఫ్యాకల్టీ వచ్చి ఆయా వర్శిటీల్లోని విద్యార్థులకు వైద్య విద్య అందించడానికి తగిన వసతులు ఏర్పాటు చేస్తామని, అపోలో కళాశాల ముందుకొచ్చిందని తెలిపారు. ఈ విషయాన్ని పరిశీలించాలని ధర్మాసనాన్ని విజ్ఞప్తి చేశారు. అనంతరం.. ఏయే వర్శిటీల్లో ఖాళీలున్నాయి? ఎన్ని సీట్లు ఉన్నాయి? ఫీజుల వివరాలేంటి? అనే అంశాలపై అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ నవంబరు22కు వాయిదా వేసింది.

భారత్‌తో ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలు బలోపేతం

- అమెరికా ఆర్థిక మంత్రి యెలెన్ వెల్లడి



న్యూఢిల్లీ : భారత్‌తో ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి అమెరికా కట్టుబడి వుందని అమెరికా ఆర్థిక మంత్రి జానెట్ యెలెన్ తెలిపారు. ఇరు దేశాల మధ్య సహకారం స్థాయిని పెంచుకోవడానికి కూడా తాము నిబద్ధతతో వున్నామని చెప్పారు. అమెరికా-భారత్ ఆర్థిక భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవ సమావేశంలో ఆమె ప్రసంగించారు. "ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలుగా, ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు ఈ వార్షిక సమావేశాలనేవి ఒక అవకాశం." అని ఆమె వ్యాఖ్యానించారు. ఈ వేదికపై సహకారం వల్ల ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలు అభివృద్ధి చెందడం, సుస్థిరత సాధించడమే కాదు, ఇండో-పసిఫిక్ ప్రాంత వ్యాప్తంగా ఆర్థిక ప్రగతికి మద్దతుగా నిలవగలమని ఆమె పేర్కొన్నారు. "ఈనాడు మనం అనేక రకాలైన సవాళ్ళను, ఆర్థిక పరమైన ఒత్తిళ్ళను ఎదుర్కొంటున్నాం. కోవిడ్ ప్రభావం నుండి ప్రపంచం ఇంకా పూర్తిగా కోలుకోలేదు. మరోవైపు ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం కారణంగా ఇంధన, ఆహార ధరలు అనూహ్యమైన రీతిలో పెరిగిపోయాయి. ద్రవ్యోల్బణం ఒత్తిళ్ళు కూడా విపరీతంగా పెరిగిపోయాయి." అని యెలెన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. అయితే, ఈ తరహా సవాళ్ళు అమెరికా, భారత్‌ల మధ్య నెలకొన్నటువంటి భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి దోహదపడతాయని అన్నారు. సహకారం ఆవశ్యకతను, ఎలాంటి అరమరికలు లేని స్పష్టమైన కమ్యూనికేషన్‌ను ప్రదర్శించడం ద్వారా ఈ సవాళ్ళను ఎదుర్కొనవచ్చన్నారు. మన పటిష్టమైన వాణిజ్యం, పెట్టుబడులు, ప్రజల మధ్య సంబంధాలు ఇవన్నీ కలిసి ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను ఈ భాగస్వామ్యంలో కీలకమైన భాగంగా రూపొందిస్తాయని చెప్పారు.

అంతర్జాతీయ సవాళ్ళను మరింత సమన్వయ రీతిలో ఎదుర్కొనడానికి, బహుళవాదాన్ని బలోపేతం చేయడానికి అమెరికాతో సన్నిహిత సహకారాన్ని భారత్ కొనసాగిస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. విశ్వసనీయమైన భాగస్వామిగా అమెరికాకు విలువిస్తుందని అన్నారు. క్వాడ్, ఇండో పసిఫిక్ ఎకనామిక్ ఫ్రేమ్‌వర్క్ ఇవన్నీ మన సహకారాన్ని మరింత విస్తరించాయన్నారు. ఈ భాగస్వామ్య సదస్సుకు ముందుగా యెలెన్, నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. పరస్పర ప్రయోజనకరమైన అంశాలపై ఇరువురు చర్చించారు.

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో తేలని ఫలితాలు

- వచ్చే వారానికల్లా స్పష్టత



వాషింగ్టన్ : అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఓటింగ్ జరిగి మూడు రోజులు గడిచినా ఇప్పటికీ అమెరికన్ కాంగ్రెస్‌పై పట్టు ఎవరికి వచ్చిందనే విషయంలో స్పష్టత లేదు. కీలకమైన పోటీ జరుగుతున్న సీట్ల ఫలితాలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. అరిజోనా, నెవడా రాష్ట్రాల సీట్లపైనే ఇప్పుడు అందరి కళ్ళు వున్నాయి. ఇక్కడ వందలు వేల సంఖ్యలో లెక్కించని మెయిల్ ఓట్లు సెనెట్‌పై పట్టుకు కీలకంగా మారాయి. ఈ రెండు రాష్ట్రాల్లోని సీట్లను మొత్తంగా గెలుచుకోవడం ద్వారా సెనెట్ మెజారిటీ అటు డెమోక్రాట్లకు లేదా ఇటు రిపబ్లికన్లకు రావాలి. అయితే, ఒకవేళ చీలిక గానీ సంభవిస్తే, జార్జియాలో డిసెంబరు 6న జరిగే సెనెట్ ఎన్నిక పరోక్ష యుద్ధంగా మారే అవకాశముందని భావిస్తున్నారు. ఇదిలా వుండగా, ప్రతినిధుల సభపై పట్టుకు రిపబ్లికన్లు నెమ్మదిగా చేరువవుతున్నారు. మెజారిటీకి అవసరమైన 218 సీట్లలో గురువారం పొద్దుపోయే సమయానికి రిపబ్లికన్లు 211 సీట్లను గెలుచుకున్నారు. డెమోక్రాట్లు 197 స్థానాలతో వున్నారు. అంటే మొత్తంగా 27 స్థానాల ఫలితాలు ఇంకా రావాల్సి వుంది. వీటిలో చాలా సీట్లలో గట్టి పోటీ నెలకొని వుంది. రిపబ్లికన్లు ప్రతినిధుల సభపై పట్టు సాధించడం ఖాయమని అంటూ తాను స్పీకర్ పదవికి పోటీ చేస్తానని రిపబ్లికన్ నేత కెవిన్ మెక్‌కార్తే చెప్పారు. అయితే తాను ఇంకా ఆశ కోల్పోలేదని బైడెన్ గురువారం వ్యాఖ్యానించారు. ఇంకా తాము గెలిచేందుకు అవకాశాలు వున్నాయని అన్నారు. అరిజోనా, నెవడా రాష్ట్రాల ఫలితాలు రావడానికి కనీసం వచ్చే వారం వరకు పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఇరాన్‌లో ఆగని ఆందోళనలు

- మహిళా జర్నలిస్ట్ అరెస్ట్

టెహ్రాన్ : ఇరాన్‌లో నిరసనలు హోరెత్తుతున్నాయి. 'ఇస్లాం మత పెద్దలు మాకు వద్దు' అంటూ ఆందోళనకారులు నినదిస్తున్నారు. ఆందోళన కారులపై అణచివేతలు అధికమవుతు న్నాయి. దేశంలో ఆందోళనకారులకు స్థానం లేదంటూ ఆర్మీ చీఫ్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఇరాన్ సుప్రీం నేత అయాతుల్లా ఖొమేని ఆదేశిస్తే.. నిరసనలను అణచివేస్తామని హెచ్చరించారు. ఈ ప్రకటన వెలువడిన కొద్దిగంటల్లోనే.. ఓ మహిళా జర్నలిస్ట్‌ని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. దేశంలో ఇరాన్ మతాధికారులు అశాంతిని పెంచుతున్నారంటూ లండన్‌కి చెందిన టెలివిజన్‌కు సమాచారం పంపారంటూ బలగాలు ఆరోపించాయి. ఎల్హామ్ అఫ్కారీ దేశం నుండి పారిపోవడానికి ప్రయత్నించినపుడు బలగాలు అరెస్టు చేశాయని, ఆమె ఇరాన్ అంతర్జాతీయ మీడియా ఏజెంట్ అని అధికారిక మీడియా 'ఫార్స్' పేర్కొంది. అయితే ఈ వార్తపై స్పందించేందుకు అధికారులు నిరాకరించారు. దేశంపై నిందలు వేయడం, యువతను అల్లర్లకు ప్రేరేపించడం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం వంటి అనేక చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేపట్టారని మీడియా పేర్కొంది. మంగళవారం లండన్ ఛానెల్‌ను ఉగ్రవాద సంస్థగా ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్ అభివర్ణించిన సంగతి తెలిసిందే.

ఈ వార్తలను హక్కుల కార్యకర్తలు ఖండించారు. అఫ్కారీ దేశం విడిచి పారిపోయేందుకు యత్నించలేదని, ఆమెను దక్షిణ నగరమైన షిరాజ్‌లో అరెస్ట్ చేశారని, అది ఆమె స్వస్థలమని అన్నారు. అఫ్కారీ పరిస్థితి గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ .. ఆమె కుటుంబసభ్యులు షిరాజ్‌లోని ఇంటెలిజెన్స్ సర్వీస్ కార్యాలయం ఎదుట బారులు తీరిన దృశ్యాలను ఆందోళన కారులకు మద్దతు ప్రకటించే 1500 తస్వీర్ పేర్కొంది. ఆందోళనలను అణచివే సేందుకు ఇరాన్ ప్రభుత్వం యత్నిస్తోందని... అఫ్కారీ మూడేళ్ల కుమార్తెను కూడా అరెస్ట్ చేసేలా ధిక్కారపూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు.

నవాజ్ షరీఫ్‌కు దౌత్య పాస్‌పార్ట్

లండన్ : పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ స్వదేశానికి వెళ్లడానికి ద్వారాలు తెరుచుకొంటున్నాయి. 2019 నుంచి ఆయన లండన్‌లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు తాజాగా పాకిస్థాన్ ప్రభుత్వం దౌత్య పాస్‌పోర్టును జారీ చేసింది. పిఎంఎల్ ఎన్ నేతత్వంలోని పాక్ ప్రభుత్వం నవాజ్ షరీఫ్ ఐదేళ్లు ఉండేలా ఈ పాస్‌పోర్టు జారీ చేసినట్లు ఆయన కుటుంబ సభ్యులు వెల్లడించారు. దీంతో ఆయన స్వదేశానికి వచ్చేందుకు అవకాశం లభించింది. ఇటీవల పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మంత్రులతో కలిసి లండన్ వెళ్లారు. అక్కడ ఆయన నవాజ్‌షరీఫ్‌తో భేటీ అయ్యారు. ఆ తర్వాత ఈ పరిణామాలు చోటు చేసుకోవడం విశేషం.



108 అడుగుల కెంపెగౌడ విగ్రహం ఆవిష్కరణ

బెంగళూరు: దక్షిణాది రాష్ట్రాల పర్యటనల్లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ శుక్రవారం కర్ణాటకలో పర్యటించారు. బెంగళూరులో విమానాశ్రయం వద్ద 108 అడుగుల ఎత్తయిన నాద ప్రభు కెంపెగౌడ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.5వేల కోట్లతో నిర్మించిన టెర్మినల్-2ను ప్రారంభించారు. ముందుగా నగరంలోని హెచ్ఎఎల్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్న ప్రధానికి కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై తదితరులు స్వాగతం పలికారు. కెఎస్ఆర్ రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలును ప్రారంభించారు. మైసూర్, చెన్నై మధ్య ఈ రైలు నడుస్తుంది. దేశంలో ఇది ఐదో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు. అలాగే, భారత్ గౌరవ్ కాశీ దర్శన్ రైలును కూడా ప్రధాని ప్రారంభించారు. ఈ పర్యటన తరువాత తమిళనాడులోని దిండిగల్‌కు ప్రధాని చేరుకున్నారు. అక్కడ గాంధీగ్రామ్ రూరల్ ఇనిస్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు.

మతం మారిన దళితులు ఒబిసిలా?

- కేంద్రం అఫిడవిట్‌పై ఎఐఎడబ్ల్యుయు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మతం మారిన దళితులు ఒబిసిలు ఎలా అవుతారని ఎఐఎడబ్ల్యుసి ప్రశ్నించింది. దళితుల ఆత్మగౌరవం మీద హిందుత్వాన్ని రుద్దడానికి బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తున్నాయని, అందులో భాగంగానే సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని ధ్వజమెత్తింది. రాజ్యాంగ హక్కులను దళితులకు దక్కకుండా సంఘ్ పరివార్ శక్తులు ఆయా వర్గాలను సమాజానికి దూరంగా చేసేందుకు సుప్రీం కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌ను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. దళితులు మతం మారితే ఒబిసిలు అవుతారని ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపు ఇచ్చింది. ఈ మేరకు ఎఐఎడబ్ల్యుయు శుక్రవారం జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయరాఘవన్, బి.వెంకట్‌లు ప్రకటన విడుదల చేశారు. క్రైస్తవ, ఇస్లాం మతాలను స్వీకరించిన దళితులకు ఎస్‌సి రిజర్వేషన్లు, ఇతర ప్రయోజనాలు వర్తించవని, వారు ఒబిసి కింద ప్రయోజనాలు పొందవచ్చునని అఫిడవిట్ దాఖలు చేసిందని తెలిపారు. దళితుల హక్కులను కాలరాసే చర్యల్లో భాగంగానే బిజెపిప్రభుత్వం ఇలా చేసిందని విమర్శించారు. హిందూ సమాజంలో ఉన్న అణచివేత క్రైస్తవ, ఇస్లాం సమాజంలోనూ ఉందని సూచించేందుకు ప్రామాణిక సమాచారం అందుబాటులో లేదని, ఎస్‌సిలకు అర్హులైన ప్రయోజనాలను మతం మారిన దళితులకు ఇవ్వలేమని కేంద్రం తప్పుడు వాదనలను పెట్టిందని దుయ్యబట్టారు. ఇప్పటికే మతం మారినా కులవివక్ష మారలేదని, దాడులు,దౌర్జన్యాలు, కులదురంకార హత్యలు ఆగలేదని, కులవివక్ష అంటరానితనం పోలేదని తెలిపారు.

కొలీజియం సిఫార్సులను ఆపడం ఆమోదయోగ్యం కాదు

- న్యాయ నియామకాల్లో జాప్యంపై కేంద్ర న్యాయ కార్యదర్శికి సుప్రీం నోటీసు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన కొలీజియం సిఫార్సులను నిలుపుదల చేయడం ఆమోదయోగ్యం కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ మేరకు కేంద్ర న్యాయ కార్యదర్శికి నోటీసులు ఇచ్చింది. న్యాయమూర్తులుగా నియామకం కోసం కొలీజియం సిఫారసు చేసిన పేర్లను ప్రాసెస్ చేయడంలో కేంద్ర ప్రభుత్వ జాప్యాన్ని ప్రశ్నిస్తూ బెంగళూరుకు చెందిన అడ్వకేట్స్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ ఎఎస్ ఓకాతో కూడిన ధర్మాసనం విచారించింది. "రెండో సారి తెలియజేసిన తరువాత, అపాయింట్‌మెంట్ మాత్రమే జారీ చేయబడాలి. పేర్లను నిలుపుదల చేయడం ఆమోదయోగ్యం కాదు. ఇలా చేయడం వల్ల వారి పేర్లను ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేయడంగా ఉంటుంది" అని తెలిపింది. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తరపున సీనియర్ న్యాయవాది వికాస్‌సింగ్ వాదనలు వినిపిస్తూ సుప్రీం కోర్టులో నియామకాలను నిలిపివేసినందుకు కేంద్రంపై ధిక్కార చర్యలను ప్రారంభించాలని ధర్మాసనాన్ని కోరారు. కొలీజియం ప్రతిపాదించిన జయతోష్ మజుందార్ ఇటీవల మరణించారని అన్నారు. జస్టిస్ దీపాంకర్ దత్తా పేరును ప్రతిపాదించి ఐదు వారాలైందని, దానిని రెండు రోజుల్లో ఆమోదించాల్సి ఉందని తెలిపారు. దీనిపై జస్టిస్ కౌల్ స్పందిస్తూ ధర్మాసనం ఇంకా ధిక్కార నోటీసు జారీ చేయబోవడం లేదని, నియామకాల్లో జాప్యాన్ని ఎత్తిచూపుతూ, దాని కోసం కేంద్రం పదే పదే ఎలా ఒత్తిడి చేస్తుందని ధర్మాసనం పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం 11 పేర్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 2021 సెప్టెంబర్ నాటివని జస్టిస్ కౌల్ పేర్కొన్నారు. పిటిషనర్ తరపున న్యాయవాది అమిత్ పాయ్ వాదనలు వినిపించారు. నియామకాల ప్రక్రియలో జాప్యానికి గల కారణాలపై కేంద్ర న్యాయశాఖ కార్యదర్శిని వివరణ కోరుతూ ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. 2019 జూలై 24న కలకత్తా, జమ్మూకాశ్మీర్, కర్ణాటక, అలహాబాద్ హైకోర్టులకు 11 మంది న్యాయమూర్తులను సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. మళ్లీ 2021లో రెండో సారి కూడా కేంద్రాన్ని పునరుద్ఘాటించింది. అప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టింది.

24గంటల్లో 6931 రూబిక్ క్యూబ్‌లు సాల్వ్

- గిన్నిస్ రికార్డు సృష్టించిన బ్రిటన్ యువకుడు

లండన్ : బ్రిటన్‌కి చెందిన 20ఏళ్ళ యువకుడు జార్జి షోలే గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించాడు. 24గంటల వ్యవధిలో ఏకంగా 6,931 పజిల్ క్యూబ్‌లను సాల్వ్ చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పాడని గిన్నిస్ వరల్డ్ రికార్డు (జిడబ్ల్యుఆర్) ప్రకటించింది. రూబిక్ క్యూబ్ పజిల్‌ను సాల్వ్ చేయాలనుకునే ఔత్సాహికులు ఈ ప్రయత్నాన్ని చూసేందుకు వీలుగా షోలే లండన్‌లోని ఒక హోటల్ గదిలో కూర్చుని చేసిన ఈ రికార్డును ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ నెల 9వ తేది ఉదయం 8గంటలకు గదిలో కూర్చుని ప్రారంభించిన ఈ ప్రయత్నాన్ని 10వ తేది ఉదయం 8గంటలకు పూర్తి చేశాడు. 2013లో కెనడాకి చెందిన ఎరిక్ లైమ్‌బేక్ నెలకొల్పిన 5800 రికార్డును షోలే బద్దలు కొట్టారు. లైమ్‌బేక్ సగటు సమయం ఒక్కో క్యూబ్‌కి 14.89 సెకన్లుగా వుంది. కాగా, షోలే మొదటి గంటలోనే 327 క్యూబ్‌లను పరిష్కరించారు. 8గంటలు ముగిసేసరికి 3500కి పైగా క్యూబ్‌లను సాల్వ్ చేశారు. "ఈ రికార్డులో అత్యంత కఠినమైన సమయం ఏదంటే 12గంటల మార్క్ . నేను అలిసిపోయినట్లు అనిపించింది. మిగిలిన వారందరూ ఉత్సుకతో చూస్తున్నారు. వారు ఆనందోత్సాహాలతో వున్నారు. రికార్డు సృష్టించే దిశగా నడుస్తున్నావని అన్నారు. కానీ, అప్పుడు ఇంకా 12గంటలే వున్నాయని నాకనిపించింది. " అని షోలే గిన్నిస్ సంస్థతో మాట్లాడుతూ చెప్పారు. మరో నాలుగు గంటలే గడువు వుండగా, షోలే 5849 క్యూబ్‌లను పూర్తి చేశాడు. ల్యాప్‌టాప్‌లో సాంకేతిక ఇబ్బందులు, మానసికంగా అలసట వున్నా కూడా వీటిని సాధించాడని వెబ్‌సైట్ పేర్కొంది. తర్వాత మొత్తం సమయం పూర్తయ్యేసరికి మరో వెయ్యి క్యూబ్‌లను పూర్తి చేశారని తెలిపింది. గిన్నిస్ వరల్డ్ రికార్డు డే అయిన నవంబరు 10నే షోలే ఈ రికార్డు సృష్టించడం విశేషం.



మీకోసం

శీతాకాలంలో పిల్లల మసాజ్‌కు ఆవనూనె వాడాలి. ఇది ఒంటికి సహజంగా వేడినివ్వడంతోపాటు ర్యాష్ వంటి చర్మ సమస్యలను కూడా దూరం చేస్తుంది. ఆవనూనె సాధ్యం కానప్పుడు వెన్న, మీగడలతో కూడా మసాజ్ చేయవచ్చు.

జీవన సౌరభం

వెలిగే దీపమే ఇతర దీపాలను వెలిగించినట్లు నిరంతరం నేర్చుకునే వారే ఇతరులకు జ్ఞానాన్ని పంచగలరు.

పక్షుల ప్రతిభ



నిత్యం రద్దీగా ఉండే ఒక పర్యాటక కేంద్రంలో గుబురుగా ఉన్న ఒక చెట్టుపై కొన్ని పక్షులు నివసిస్తున్నాయి. అవి గుడ్లు పెట్టి పొదగడం కోసం చక్కటి గూడు నిర్మించుకోవాలనుకున్నాయి. సుదూరం నుంచి సన్నని గడ్డిని సేకరించి పొదరిల్లు లాంటి గూడును అల్లేందుకు అవి చాలానే కష్టడ్డాయి. గూడు పూర్తయ్యాక ఆ చెట్టు కొమ్మలకు తగిలించుకున్నాయి. ఒకరోజు ఆవైపుకు వచ్చిన ఒక పర్యాటకుడు ఆ గూళ్లను చూసి ముచ్చటపడి తనతో తీసుకుని వెళ్ళిపోయాడు. అయినా మళ్లీ పక్షులు గూడు అల్లుకున్నాయి. మరొక బాటసారి ఆ పక్షుల గూడును చూసి ఆనందంతో తమ పిల్లలు ఆడుకుంటారని తీసుకు వెళ్లాడు.

ఆ చెట్టు కిందే ఉన్న మరో వ్యక్తి ఆ పర్యాటకుడితో మాట్లాడుతూ 'పక్షుల గూడును ఏం చేసుకుంటారు?' అని అడిగాడు. 'పొదరిల్లులాంటి ఈ గూడును అల్లడం మానవుల తరం కాదు. అభివృద్ధి చెందిన ఈ కాలంలో సైతం ఏ ఒక్క మనిషీ దీన్ని అల్లలేడు. అందువల్ల ఈ గూడును మా ఇంట్లోని అద్దాల పెట్టెలో పెట్టి వచ్చిన బంధువులకు చూపిస్తాను' అని గొప్పగా చెప్పాడు.

రెక్కలు ముక్కలు చేసుకుని అల్లిన గూళ్ళను ఎవరో ఒకరు కాజేసి తీసుకుని వెళ్ళడం చూసి పక్షులు మనసులో చాలా బాధపడేవి. చేసేది లేక మరో గూడును అల్లడం ప్రారంభించేవి. ఈ దృశ్యాన్ని ఒక ఉడుత గమనిస్తుంది.

ఒకరోజు ఉడుత పక్షులతో మాట్లాడుతూ 'మీరు చాలా రోజులు పాటు ఇంత కష్టపడి అల్లిన గూళ్ళను అయాచితంగా కాజేసి ఈ మనుషులు తీసుకుని వెళుతున్నారు కదా? మనుషులకు అందనంత ఎత్తులో ఈ గూళ్ళను నిర్మించుకుంటే రక్షణ ఉంటుంది కదా?" అని సూచించింది.

అందుకు పక్షులు బదులిస్తూ 'ఎంతో అభివృద్ధి సాధించామని విర్రవీగే ఈ మనుషులు మేము అల్లిన గూళ్ళను మాత్రమే తీసుకుని వెళ్ళ గలుగుతున్నారు. గూళ్ళను అల్లే మా ప్రతిభను తీసుకుని వెళ్ళ లేరు కదా ఉడుత మిత్రమా! ఇకపై నీ సూచన బాగుంది. ఈ మనుషులకు అందనంత ఎత్తులో మా గూళ్ళను నిర్మించుకుని రక్షించుకుంటాము' అని చెప్పాయి.

\- షేక్ అబ్దుల్ హకీం జాని
99494 29827



దేని నీడ ఏది?

చిన్నారులూ, ఇక్కడ కొంతమంది పిల్లలు రకరకాల వేషధారణలో ఉన్నారు. ఎదురుగా వారి నీడలు ఉన్నాయి. దేని నీడ ఏదో కనిపెట్టి జతచేయండి.

నేను గీసిన బొమ్మ



ఫ్రెండ్స్! స్నేహమే అన్నింటి కన్నా గొప్పది అని చెబుతూ ఈ బొమ్మలు గీశాను. బాగుంది కదూ!

\- గుండెల్లి నవీన్ కుమార్, జక్కాపూర్, సిద్దిపేట జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆడపిల్లలకే కాదు, అందరికీ తెలియాలి!

ఏంచక్కా ఆడుతూ పాడుతూ గెంతుతూ తిరిగే వయసులో ఈ పీరియడ్స్ రావడం ఏంటో? మాకేం అర్థం కావట్లేదు. అసలే చదువుతో సతమతం అవుతుంటే ప్రతి నెలా మూడు, నాలుగు రోజులు ఈ చికాకు ఏంటో? ఇంత రక్తం పోవడం ఏంటో? దాంతో బయటకు చెప్పలేని సమస్యలెన్నో మాకు ... ఇది కేవలం మా సమస్యా? అందరికీ తెలియాలి కదా?


మొదటిసారి పీరియడ్స్ వచ్చినప్పుడు ఇంట్లో 10 రోజులు కూచోబెట్టారు. చివరి రోజు చుట్టాలందరినీ పిలిచి ఫంక్షన్ చేశారు. అందరితో కలిసి ఫొటోలు దిగమన్నారు. దీనికి ఇంత హడావిడి అవసరమా అనిపించింది. మా ఫ్రెండు కావ్యకు అయితే మెచ్యూర్ అయిన సమయం బాగోలేదంటూ పూజలు చేయించారు. ఇదంతా ఏమిటో అర్థం కాని అయోమయం. అమ్మను అడగితే– నీకేం.. తెలియదు.. ఇలాగే చేస్తారు. నోర్మూసుకో.. అంది. ఇలాగే ఎందుకు చేయాలి? చేసే ప్రతి పనికీ ఒక అర్థం ఉండాలి కదా?

ఆ తర్వాత మాపై క్రమంగా నిబంధనలు మొదలయ్యాయి. 'నీవు ఆడపిల్లవి..' అంటూ షరతులు ప్రారంభమయ్యాయి. 'మగపిల్లలతో పెద్దగా మాట్లాడొద్దు. పెద్దగా నవ్వకు, ఎగరకు, పెద్దగా మాట్లాడకు, ఆటలు ఆడకు, తల పైకెత్తి నడవకు' అంటూ చెప్పడం మొదలైంది. ఎందుకూ? అంటే మళ్లీ మామూలే! 'నువ్వు ఆ.. డ .. పిల్లవి'. ఏమడిగినా ఒకటే జవాబు : 'నువ్వు ఆ.. డ .. పిల్లవి'... 'నువ్వు ఆ.. డ .. పిల్లవి'. ఎందుకు పదే పదే ఇది గుర్తు చేస్తారు? మా చిన్నూ గాడు మగపిల్లాడు కదా! వాడికి అలాగే గుర్తు చేస్తున్నారా? లేదు. అదే విషయం అడిగాననుకొండి. మళ్లీ అదే సమాధానం : 'నువ్వు ఆ.. డ .. పిల్లవి'. బహుశా ఆడపిల్ల అంటే – నోరు మూసుకొని ఉండడం కాబోలు!


'ఆడపిల్ల తొందరగా ఎదుగుతుంది. నాలుగేళ్ల పోతే పెళ్లి చేయాలంటూ అంటూ అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య గబరాపడిపోతారు. దాంతో బాగా చదవాలన్న ఆసక్తి తగ్గుతుంది. మేమూ పిరికివాళ్లలా తయారవుతాం. అప్పటి వరకూ స్నేహితుల్లా ఉన్న మగపిల్లలతో కలిసి మాట్లాడి, ఆట పట్టించిన మేము, వారిని చూస్తుంటే ఏదో తెలియని బిడియం, బెరుకు మొదలవుతాయి. దూరంగా జరుగుతాం.

అప్పటివరకూ ఇష్టమైన డ్యాన్సు నేర్చుకుంటాం. ఫ్రెండ్స్‌తో కలిసి చిందులు తొక్కుతాం. గుళ్ల దగ్గర, రోడ్ల వెంట తిరుగుతూ... స్నేహితుల ఇళ్ల దగ్గర గంటల తరబడి ఆడుకుంటాం. మెచ్యూర్ అయిన దగ్గర నుంచి 'ఇక అవేమీ కుదరవు' అని అమ్మలు అంటుంటే మా మనసులు ఒప్పుకోవు. ఇప్పటివరకూ ఒకలా చూసిన చుట్టుపక్కల వారంతా, ఇప్పటి నుంచీ పెద్దవాళ్లం అయినట్లు చూస్తారు. ఏంటో!

మాకు నిండా 13 ఏళ్లు వచ్చాయా! ఏంచక్కా సెవెంత్ క్లాసు పాస్ అయ్యి ఎనిమిదిలోకి వెళుతున్న సంతోషంతో ఉంటాం. కాని మాకు లోపల ఏదో తెలియని బిడియం ఉంటుంది. ప్రతి నెలా వచ్చే నెలసరితో ఆ మూడు, నాలుగు రోజులు స్కూలుకు ఎలా నడిచి వెళ్లాలా? అని ఆలోచిస్తాం. అయినా చదువుకోవాలన్న పట్టుదలతో ధైర్యంగా ముందుకెళతాం.



ప్రతి నెలా పీరియడ్స్ వస్తాయని, దాంతో కడుపులో నొప్పి వస్తుందని అప్పుడప్పుడే అర్థమవుతూ ఉంటుంది. అప్పటి నుంచి మాకు మాత్రమే అర్థమయ్యే ప్రపంచాన్ని చూస్తున్నట్లు ఉంటుంది. శరీరంలో అవయవాల్లోనూ మార్పు కనిపిస్తుంది. కొత్త కొత్తగా ఉంటుంది. ఇంట్లో ఉన్న మగవాళ్లకు ఇవేమీ తెలియకూడదంటారు. ఆ ప్యాడ్స్ కనిపించకుండా దాచిపెట్టమంటారు. ఎందుకు? మనం ఏం తప్పు చేశాం? ఇదంతా సహజమైన శారీరక మార్పే కదా? నాన్నకీ, తమ్ముడికీ, అన్నకీ తెలియాలి కదా, మేమంతా పడుతున్న బాధ. తెలిస్తే తప్పేముంది? రహస్యంగా ఉంచడం వల్ల ఉపయోగం ఏముంది? మనవాళ్లకు అన్నీ తెలిస్తేనే కదా, మనం మరింత బాగా అర్థమవుతాం...



అమ్మా, టీచర్ చెప్పినట్లుగా ముందు జాగ్రత్తగా న్యాప్‌కీన్లు బ్యాగులో పెట్టుకున్నా. కాని పుస్తకాలు తీసి, పెడుతున్న ప్రతిసారీ అది కనిపిస్తూ ఉంటే 'మాకు ప్రతి నెలా మెన్సెస్ వస్తుంది' అని గుర్తు చేస్తున్నట్లు ఉంటుంది. ఆ టైంలో ఏదో తెలియని అసహనం.

స్కూలుకు వెళ్లాక డేట్ వస్తుంది. అది తెలిసి వెంటనే బాత్‌రూమ్‌కు వెళ్లి, రక్తపు మరక చూసి కంగారుపడిన సందర్భాలెన్నో... ఒక్కోసారి చమటలు పడతాయి. భరించలేని నడుము నొప్పి వస్తుంది. దాంతో బాధపడుతూ... క్లాసులో కూర్చొలేకపోతాం. అయినా మా బాధనంతా అణుచుకునేందుకు ప్రయత్నిస్తాం. 'ఇదంతా మామూలే' అని సీనియర్ అక్కలు అంటుంటే ప్రతి నెలా ఇంత రక్తం పోతుందా? అని బాత్‌రూమ్‌లోనే ఏడ్చుకుంటాం. అయినా మంచి మార్కులు తెచ్చుకునేందుకు దృష్టి పెడతాం. కష్టపడి చదువుకుంటాం.

ఒక వేళ డేట్ ముందే వస్తే... ఇంకా నెల రోజులు కాలేదే అని చేతి వేళ్ల మీద తేదీ లెక్కపెట్టుకుంటాం. క్లాసు పీరియడ్, పరీక్షల టైంటేబుల్‌తో పాటు ఈ డేట్ గుర్తుపెట్టుకోవడం కొత్తగా అనిపిస్తూ ఉంటుంది. ఆ టైంలో క్లాసులో కూర్చున్నా... రక్తం ఎక్కడ డ్రసుకు అంటుతుందోనన్న భయంతో టీచర్ చెబుతున్న పాఠం మీద ఏకాగ్రత పెట్టలేం. ఇదేనేమో క్లాసులో వెనకబడటానికి కారణం అనిపిస్తూ ఉంటుంది.

చిన్న గాయమైతే పెద్దగా అరిచి, కట్టుకట్టించుకుని, పనిచేయకుండా కూర్చొనేవాళ్లం. ఇప్పుడు శరీరంలో నుంచి ఇంత రక్తం పోతుంటే భరించటానికే కష్టంగా ఉంటుంది. పదే పదే బాత్‌రూమ్‌కు వెళ్లాలంటే భయంగానూ, సిగ్గుగానూ ఉంటుంది.

స్నేహితులు గ్రౌండ్‌కు వెళ్లి ఆడుకుంటారు. వారితో ఆడనివ్వకుండా కాళ్లు ఎవరో కట్టేసినట్టు అనిపిస్తూ ఉంటుంది. మరోపక్క మగపిల్లలకు ఎన్‌సిసి క్లాసు జరుగుతుంది. వారిని చూసి మేమూ అవకాశం కోల్పోయాం అని బాధ కలుగుతుంది.

డేట్‌లో ఉన్నప్పుడు రవళి వాళ్ల ఇంట్లో పచ్చని మొక్కలు ముట్టుకోవొద్దని చెబుతారు. అంటుకుంటే చెట్టు ఎండిపోతుంది అట. కాయలు కాయవట. దారుణం కదా, ఇలా అనటం? దేవుడు గదివైపు వెళ్లొద్దని చెబుతారు. ఇంట్లో ఏ వస్తువూ తాకొద్దంటారు. ఎందుకూ? అంటే అంటు, ముట్టు, చెడు రక్తం అంటూ దూరంగా ఉంచుతారు. అయినా స్కూల్లో బాధ్యతగా అప్పగించిన చెట్టుకు నీళ్లు పోస్తాం. కాని ఆ చెట్టేకేమీ కాలేదు. ఈ మూఢ నమ్మకాలను పెద్దవాళ్లు ఎప్పుడు వదిలేస్తారు? మాకు సంబంధం లేని అపవాదులను మా మీదికి నెట్టకుండా ఎప్పుడు ఉంటారు?

మా అందరికీ తల్లిదండ్రులు, టీచర్లు సపోర్టుగా నిలబడాలి. ఇవన్నీ భరిస్తూనే ఆటల్లో రాణిస్తున్న క్రీడామణుల ప్రతిభను వివరించాలి. మా పరిస్థితి అర్థం చేసుకుని రెస్టు రూమ్స్‌లో విశ్రాంతి తీసుకోనివ్వాలి. మాకు మాత్రమే అవగాహన ఉంటే సరిపోదు. మాకు సహాయంగా ఉండేలా మగపిల్లలకు అవగాహన కలిగించాలి. అన్నకు, నాన్నకు, మా క్లాసులోని అబ్బాయిలు అందరికీ ఈ సంగతి తెలియాలి. ఈ అంశం అమ్మాయిలది మాత్రమే కాదు; అందరిదీ!

\- పద్మావతి

'మీట్ క్యూట్' పోస్టర్

2018లో నాని వాల్ పోస్టర్ సినిమా అనే ప్రొడక్షన్ సంస్థను స్థాపించాడు. ఈ బ్యానర్‌లో రూపొందుతున్న కొత్త చిత్రం 'మీట్ క్యూట్' ఈ చిత్రంతో నాని సోదరి దీప్తి ఘంటా దర్శకురాలిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తుంది. గతంలో ఈమె 'అనగనగా ఒక నాన్న' అనే షార్ట్ ఫిలిం తెరకెక్కించింది. ఈ షార్ట్ ఫిలిం గొప్ప ప్రశంసలు దక్కించుకుంది. ఆంథాలజీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం నేరుగా ఓటీటీ సంస్థ సోనిలవ్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ను శనివారం రిలీజ్ చేయనున్నట్లు నాని సోషల్ మీడియాలో వెల్లడించాడు. చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేశాడు. ఈ మూవీలో ఆరుగురు హీరోయిన్‌లు నటించారు. రుహాని శర్మ, ఆకాంక్షసింగ్, ఆదా శర్మ, వర్షబొల్లమ్మ, సునైనా, సంచిత పూనాచ వంటి ఆరుగురు ఈ చిత్రంలో కథానాయిక పాత్రలు పోషించారు. సత్యరాజ్, రోహిణి కీలకపాత్రలు పోషించారు. వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై నాని, ప్రశాంతి తిపిర్నేని సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు.





హైదరాబాద్‌లో 'ఎన్‌సీ 22' షూటింగ్

హీరో నాగచైతన్య, వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో వస్తున్న సినిమా 'ఎన్‌సీ 22'. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ మూవీలో కృతిశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. యాక్షన్ ఎంటర్టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో వెన్నెల కిశోర్, ప్రేమ్‌గీ అమరేన్, సంపత్ రాజ్, శరత్‌కుమార్, ప్రియమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. హైదరాబాద్ లో ఎన్‌సీ 22 యాక్షన్ షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ యాక్షన్ ఎపిసోడ్ కోసం హైదరాబాద్‌లో భారీ సెట్టు వేశారు. ఈ చిత్రంలో విలన్‌గా నటిస్తున్న అరవింద్ స్వామితోపాటు మెయిన్ లీడ్ యాక్టర్లు సంపత్ రాజ్, శరత్‌కుమార్, కతిశెట్టిపై వచ్చే యాక్షన్ పార్టు చిత్రీకరణ కొనసాగుతుందని సమాచారం.

టీమిండియా ఓటమికి కారణాలివేనా..!

ఇంగ్లండ్ చేతిలో ఓటమితో అభిమానుల నిరాశ



మెల్‌బోర్న్: టీమిండియా సెమీస్‌లో ఓటమితో టైటిల్ వేట నుంచి వైదొలిగింది. లీగ్ దశలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, జింబాబ్వేలపై గెలిచిన టీమిండియా.. దక్షిణాఫ్రికా చేతిలో పోరాడి ఓడింది. సెమీస్‌కు ముందు వరకు టైటిల్ ఫేవరెట్‌గా ఉన్న టీమిండియా.. ఇంగ్లండ్ చేతిలో ఘోర పరాజయాన్ని క్రీడాభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇంగ్లండ్ చేతిలో 10 వికెట్ల తేడాతో ఓటమిని తమ మనసుల్లోంచి తుడిచేయలేకపోతున్నారు. టీమిండియా ఆటగాళ్లయితే ఆ రాత్రంతా కంటికి మీద కునుకు లేకుండా చేసుకున్నారని బిసిసిఐ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. ఇక టీమిండియా ఓటమికి కారణాలను వెతకడం కంటే ఇంగ్లండ్ ఆటగాళ్ల ప్రదర్శన మెరుగ్గా ఉందని చెప్పుకోవచ్చు. టి20 ఫార్మాట్‌లో టాస్ విజయం మ్యాచ్ ఫలితాన్ని శాసిస్తోందని మరోసారి ఋజువు చేసింది. ఈ ఫార్మాట్‌లో టాస్ గెలిచిన ఏ కెప్టెన్ అయినా.. నిర్మొహమాటంగా బౌలింగ్‌కే మొగ్గు చూపుతాడనే నిజం మరోమారు నిజమైంది. అంపైర్ల నిర్ణయాలు టీమిండియా ఫలితంపై కొంత ప్రభావాన్ని చూపాయి. ఒకటి, రెండు అంపైర్ తప్పుడు నిర్ణయాలు తీసుకున్నట్లు తేటతెల్లమైంది. కెప్టెన్ రోహిత్ శర్మ మూడో అంపైర్ నిర్ణయానికి వెళ్లపోవడంతో ఇంగ్లండ్ బ్యాటర్స్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. టీమిండియా బౌలర్లలో హర్షల్ పటేల్, జస్ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా లేని లోటు కొట్టొచ్చినట్లు కనబడింది. విరాట్ కోహ్లి ఈ టోర్నమెంట్‌లో అద్భుత ఫామ్‌తో ఆకట్టుకోగా.. సూర్యకుమార్ యాదవ్ ఫర్వాలేదనిపించాడు. హార్దిక్ పాండ్యా, రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్ ఆరు మ్యాచుల్లో ఒక్క అర్ధసెంచరీని మాత్రమే చేశారు. 2022 టి20 ప్రపంచకప్‌కు ఆతిథ్యమిచ్చిన ఆస్ట్రేలియా జట్టు ఏకంగా లీగ్‌లో ఓడితే.. నెదర్లాండ్ జట్టు దక్షిణాఫ్రికాపై, జింబాబ్వేజట్టు పాకిస్తాన్‌ను ఓడించడం ఈ టోర్నీలో చెప్పుకోదగ్గ మ్యాచ్‌లే.



న్యూజిలాండ్ టూర్‌కు కోచ్‌గా లక్ష్మణ్

ముంబయి: టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడ్ న్యూజిలాండ్ పర్యటన నుంచి వైదొలిగాడు. భారతజట్టు టి20 ప్రపంచకప్‌లో సెమీస్‌లో ఓటమితో ద్రావిడ్‌తోపాటు కోచింగ్ స్టాఫ్ కూడా ఆ టూర్‌కు విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు బోర్డుకు తెలిపారు. దీంతో నేషనల్ క్రికెట్ అకాడమీ కివీస్ టూర్‌కు కోచ్‌గా వివిఎస్ లక్ష్మణ్ నియమిస్తున్నట్లు ప్రకటించింది. హెడ్ కోచ్‌తోపాటు హృషికేశ్ కనిత్కర్‌ను(బ్యాటింగ్), సాయిరాజ్ బహుతులే(బౌలింగ్) కోచ్‌లుగా నియమించింది. ఈ పర్యటనలో భారతజట్టు న్యూజిలాండ్‌తో మూడేసి టి20, వన్డే మ్యాచ్‌లను ఆడనుంది. ఈనెల 18న వెల్లింగ్టన్‌లో జరిగే తొలి టి20తో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఇక ఈ పర్యటనకు దూరంగా ఉండాలని రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్, రవిచంద్రన్ అశ్విన్ ముందే నిర్ణయం తీసుకోగా.. టీమిండియా టి20 జట్టుకు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, వన్డేలకు శిఖర్ ధావన్ కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు.



2న 'మట్టి కుస్తీ'

విష్ణు విశాల్ హీరోగా విష్ణు విశాల్ స్టూడియోస్, ఆర్ టి టీమ్‌వర్క్స్ బ్యానర్‌లపై రవితేజ స్వయంగా నిర్మిస్తున్న చిత్రం 'మట్టి కుస్తీ'. 'ఎఫ్ఐఆర్' తర్వాత రవితేజతో విష్ణు విశాల్‌కి ఇది రెండో సినిమా. ఈ సినిమాలో ఐశ్వర్య లక్ష్మి కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ చిత్రం డిసెంబర్ 2న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలిపారు. రిలీజ్ డేట్ ను ప్రకటిస్తూ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. యాక్షన్‌తో కూడిన ఈ సినిమాలో విష్ణు విశాల్ రెజ్లర్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ చిత్రానికి రచయిత, దర్శకుడు చెల్లా అయ్యావు. నిర్మాతలు రవితేజ, విష్ణు విశాల్, బ్యానర్లు ఆర్ టి టీమ్‌వర్క్స్, విష్ణు విశాల్ స్టూడియోస్, డిఓపి రిచర్డ్, ఎం.నాథన్. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందించారు.

'సింగం-4'కి రంగం సిద్ధం




'సింగం' సిరీస్‌తో వరుసగా హీరో సూర్య, దర్శకుడు హరి కాంబో నుంచి వచ్చిన చిత్రాలు తమిళ, తెలుగు ప్రేక్షకులను బాగా అలరించాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సిరీస్‌లో నాలుగో పార్ట్ తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. హరి–సూర్య కలిసి 'సింగం–4'కు సిద్ధమైనట్లు సమాచారం. డైరెక్టర్ హరి పార్ట్–4కు సంబంధించిన స్క్రిప్ట్‌ను రెడీ చేసే పనిలో ఉన్నారని తెలుస్తోంది. అయితే వచ్చే ఏడాది వరకు సూర్య వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆ చిత్రాలు పూర్తయ్యాకే 'సింగం–4' పట్టాలెక్కనుంది.

టీవీ నటుడు మృతి



బాలీవుడ్ టీవీ నటుడు సిద్ధాంత్ వీర్ సూర్యవంశీ (46) శుక్రవారం మరణించారు. ఉదయం జిమ్‌లో వర్కవుట్లు చేస్తుండగా కుప్పకూలారు. ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా, కాపాడేందుకు వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గుండెపోటుతో సిద్ధాంత్ జిమ్‌లో కుప్పకూలారని వైద్యులు చెబుతున్నారు. రాజు శ్రీవాస్తవ, దీపేష్ భాన్ తర్వాత ఎక్సర్‌సైజ్ చేస్తూ మరణించిన మూడో సెలబ్రిటీ సిద్ధాంత్ సూర్యవంశీ కావడం గమనార్హం. సిద్ధాంత్ మరణం పట్ల జే భానుశాలి, సలీల్ అంకోల సహా పలువురు టీవీ సెలబ్రిటీలు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేశారు. ఆనంద్‌గా పేరొందిన నటుడు ఇటీవల తన పేరును సిద్ధాంత్ వీర్ సూర్యవంశీగా మార్చుకున్నారు. సిద్ధాంత్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కంట్రోల్ రూం, జిద్ది దిల్ మానేనా, క్యో రిస్‌ఓన మే కట్టి బట్టి వంటి టీవీషోల్లో సిద్ధాంత్ కనిపించారు. కుసుమ్, కసౌటి జిందగి కే, మమత, కృష్ణార్జున్, భాగ్యవిధాత, విరుధ్, సూర్యపుత్ర కర్ణ్, వారిస్ వంటి టీవీ షోల్లో ఆయన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది.

ప్రియమణి 'డి ఆర్ 56'



ప్రియమణి నటిస్తున్న తాజా కన్నడ చిత్రం 'డి ఆర్ 56'. ఏఎన్ బాలాజీ సమర్పణలో శ్రీ లక్ష్మి జ్యోతి క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళంలో కూడా విడుదల కానుంది. శుక్రవారం తెలుగు మోషన్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమా సీరియస్ క్రైం చుట్టూ సాగనున్నట్టు ఈ పోస్టర్‌తో అర్థమవుతోంది.

పని ఒత్తిడిని అధిగమించడానికి క్రీడలు దోహదం

- గెలుపోటములతో సంబంధం లేకుండా రాణించాలి
- నాగార్జున వర్సిటీలో రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక ఉత్సవాల ప్రారంభ సభలో వక్తలు

ప్రజాశక్తి - ఏఎన్‌యు (గుంటూరు జిల్లా)

పని ఒత్తిడి నుండి బయట పడాలంటే ప్రతి రోజు వ్యాయామ క్రీడల్లో పాల్గొనాలని వక్తలు సూచించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా 6వ రాష్ట్ర రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు–2022 శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎపిఆర్ఎస్ఎ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవంలో క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం అతిధులు పావురాలు ఎగురవేసి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడలు, యువజన సేవల ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి మోహన్ మాట్లాడుతూ ఈ మూడ్రోజులు క్రీడా పోటీల్లో పాల్గొనడమే కాకుండా ప్రతి రోజు ప్రావీణ్యమున్న క్రీడలు ఆడటంవల్ల ఒత్తిడి నుండి ఉపసమనము పొందవచ్చునని పేర్కొన్నారు. అంతర్జాతీయ షటిల్ బ్యాట్మింటన్ క్రీడాకారిణి, డిప్యూటీ కలెక్టర్ పివి సింధు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సర్వసాధారణమని, ఒత్తిడిని జయించడానికి క్రీడలను ఆడాలని అన్నారు. శాప్ ఎండి డాక్టర్ ఎం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి రెవెన్యూ క్రీడలు నిర్వహించడము అభినందనీయమన్నారు. సిసిఎల్ఎ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయి ప్రసాద్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో జిల్లాల మధ్య పోటీలు జరగాలని అభిలాషించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎపి జెఎసి అమరావతి సెక్రెటరీ జనరల్ వైవి రావు, అసోసియేట్ చైర్మన్ టివి ఫణి పాల్గొన్నారు. మొదటి రోజు పలు జిల్లాలకు చెందిన రెవెన్యూ క్రీడాకారులు క్రికెట్, త్రోబాల్, రింగ్, ఇండోర్ గేమ్స్ క్యారమ్స్ తదితర పోటీలలో పాల్గొన్నారు.



పావురాన్ని ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అంతర్జాతీయ బాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు

పట్టభద్రులు దేశసేవలో భాగస్వామ్యమవ్వాలి

మహిళా వర్సిటీ స్నాతకోత్సవంలో విశ్వభూషణ్ ● కూచిపూడి నృత్యకారిణి పద్మజారెడ్డికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ (తిరుపతి)

ప్రపంచంలోనే ఆధునిక శక్తిగా భారత్ అవతరించిందని, డిగ్రీలు పొందిన విద్యార్థులు దేశ సేవలో భాగస్వాములు కావాలని రాష్ట్ర గవర్నర్, కులపతి విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ 19, 20వ స్నాతకోత్సవం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో వేడుకగా శుక్రవారం జరిగింది. విశ్వవిద్యాలయం కులపతి హోదాలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉన్నత విద్యాసంస్థలు మెరుగైన విద్య అందించడానికి కృషి చేయాలన్నారు. పరిశోధనలు నిరంతరం జరిగినప్పుడే ఉన్నత విద్యలో సమర్థవంతంగా రాణించగలరని తెలిపారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జమున మాట్లాడుతూ మహిళా విశ్వ విద్యాలయం భారతీయ ఉన్నత విద్యాసంస్థల్లో 24వ స్థానంలో నిలిచినందుకు, ఫార్మసీ విభాగంలో 42వ ర్యాంకును సాధించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ పద్మజారెడ్డికి గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అందజేశారు. 108 మంది విద్యార్థులు గోల్డ్‌మెడల్, 1902 మందికి డిగ్రీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య డిఎం మమత పాల్గొన్నారు.



గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ పద్మజారెడ్డి

ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా

మల్లాది విష్ణు బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా, అణగారిన వర్గాల సామాజిక ఆర్థికాభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రణాళికా సంఘం పనిచేస్తోందని సంఘం ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు పేర్కొన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించుకున్న 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేస్తానన్నారు. సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షునిగా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నవరత్నాల పథకాలను ప్రణాళికాబద్ధంగా విజయవంతంగా అమలు చేసి ఆయా పథకాల ప్రయోజనాలు ప్రతి లబ్ధిదారునికీ అందేలా ప్లానింగ్‌బోర్డు కృషి చేస్తుందన్నారు. గ్రామ వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా నవరత్నాలు, ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసేందుకు ప్రణాళికా బోర్డు ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. వెనుకబడిన జిల్లాల సమగ్రాభివృద్ధికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు సకాలంలో రాబట్టేందుకు ప్రణాళికాబోర్డు ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి శాసనసభ్యునికి రూ.2కోట్ల వంతున నిధులు విడుదల చేస్తుందని, ఆయా నిధులతో చేపట్టే పనుల పర్యవేక్షణను ప్రణాళికాబోర్డు చూస్తుందని పేర్కొన్నారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవినిచ్చినందుకు సిఎం జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, విజయవాడ మేయరు రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

భారత వృద్ధి 7శాతమే..!

- అంచనాలకు మూడీస్ భారీ కోత
- 2023లో 4.8 శాతమే
- ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల దెబ్బ

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థలో బలహీనతలు పెరుగుతున్నాయని అంతర్జాతీ య రేటింగ్ ఏజెన్సీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. హెచ్చు ద్రవ్యోల్బణం, వరుసగా వడ్డీ రేట్ల పెంపు ఇతర పరిణామాలు దేశ జిడిపిని దెబ్బతీస్తున్నాయని గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ విశ్లేషించింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత ఏడాదిలో భారత వృద్ధి రేటు అంచనాలను 7 శాతానికి కోత పెడుతున్నట్లు తెలిపింది. ఇంతక్రితం ఈ అంచనా 7.7 శాతంగా పేర్కొంది. ఈ ఏడాదిలో రెండో సారి కోత పెట్టడం గమనార్హం. ప్రస్తుత ఏడాదిలో 8.8 శాతం వృద్ధి రేటు ఉండొచ్చని తొలుత మే నెలలో అంచనా వేసింది. దీన్ని సెప్టెంబర్‌లో సమీక్షించి.. ఈ అంచనాను 7.7 శాతానికి కుదించింది. తాజాగా శుక్రవారం మరో సారి కోత పెట్టింది. మే నాటి అంచనాలతో పోలిస్తే వద్ధిరేటు అంచనాలను 1.8 శాతం మేర కోత పెట్టినట్లయ్యింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మందగమనానికి తోడు భారత్‌లో అధిక వడ్డీ రేట్లు, హెచ్చు ద్రవ్యోల్బణం జిడిపికి ప్రతి కూలంగా మారాయి." అని మూడీస్ తన 'గ్లోబల్ మ్యాక్రో ఔట్‌లుక్స్ 2023-24'రిపోర్టులో పేర్కొంది.

వచ్చే ఏడాది 2023లో వృద్ధి రేటు మరింత పడిపోయి 4.8 శాతానికే పరిమితం కావొచ్చని మూడీస్ విశ్లేషించింది. 2024లో కొంత పుంజుకుని 6.4 శాతానికి చేరొచ్చని తెలిపింది. కరోనా పరిణామాల నుంచి కోలుకుంటున్న దేశ ఆర్థిక వ్యవస్థకు అధిక ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు, ప్రపంచ వద్ధి నెమ్మదించడం వల్ల అవరోధాలను ఎదుర్కొంటుందని మూడీస్ పేర్కొంది. ఆర్థిక వ్యవస్థలో తీవ్ర అస్థిరత, సుదీర్ఘంగా కొనసాగుతున్న అధిక ద్రవ్యోల్బణం, ద్రవ్య విధానాలను కఠినతరం చేయడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఈక్విటీ మార్కెట్లలోని ఒడుదొడుకులు ప్రపంచ వద్ధిరేటుకు సైతం విఘాతం కలిగించనున్నట్లు మూడీస్ పేర్కొంది.

భారత్‌లో ట్విట్టర్ బ్లూటిక్‌కు రూ.719 చార్జ్

న్యూఢిల్లీ : భారత్‌లో తమ వినియోగదారులకు బ్లూటిక్ ఫీచర్ కోసం రూ.719 (8.91 డాలర్లు) ఛార్జ్ చేయాలని ట్విట్టర్ నిర్ణయించింది. ఈ విషయమై ట్విటర్ నుంచి వినియోగదారులకు నోటిఫికేషన్లు వస్తున్నాయి. నవంబర్ 10 నుంచి ఈ సబ్‌స్క్రిప్షన్‌ను వసూలు చేయడం ప్రారంభించినట్లు రిపోర్టులు వచ్చాయి. దీన్ని ఎప్పుడు కావాలంటే అప్పుడు రద్దు చేసుకోవచ్చునని ట్విటర్ తెలిపింది. అయితే ప్రస్తుతానికి పై ఐఫోన్ వినియోగదారులకు మాత్రమే ఈ మెసేజ్‌లు వచ్చినట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో అందరికీ ఈ ఛార్జీలను వర్తింపజేయనున్నారని రిపోర్టులు వస్తున్నాయి. ఆయా దేశాల్లోని ప్రజల కొనుగోలు శక్తికి అనుగుణంగా ఈ చార్జీల్లో మార్పులు చేస్తున్నట్లు గతంలో ఎలన్ మస్క్ తెలిపారు.

ప్రభుత్వ విధానాలతో ఆక్వాసేద్యం కుదేలు

- మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం జగన్ తెచ్చిన కొత్త చట్టాలతో రాష్ట్రంలో ఆక్వాసేద్యం కుదేలైందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. ఈ చట్టాల వల్ల రొయ్యల రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం మాట్లాడారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు అప్పల రాజు, బొత్స సత్యనారాయణ ఆక్వా రైతుల బతుకులను రివర్స్ చేశారని మండిపడ్డారు. ఎపి స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ చట్టం వల్ల రొయ్యల రైతులు తీవ్రమైన నష్టాలు చవిచూస్తున్నారని తెలిపారు. క్రాప్ హాలిడే ప్రకటిస్తామని రైతులు రెండు నెలల క్రితం ప్రకటించినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్టోబర్ 17న వంద కౌంట్ మార్కెట్‌లో రూ.220 ఉంటే మంత్రుల కమిటీ రూ.240 మద్దతు ధర ప్రకటించిందని పేర్కొన్నారు. అప్పటి నుంచి వంద కౌంట్ మార్కెట్‌లో రూ.190కు పడిపోయిందని వివరించారు. ఇప్పుడు మద్దతు ధర కుదించి రూ.210లకు కొని తీరాలని మంత్రి సెలవిస్తున్నారని విమర్శించారు. మార్కెట్‌లో సోయాబీన్ ధర తగ్గినా ఫీడ్ ధర మాత్రం ఎందుకు తగ్గడం లేదని ప్రశ్నించారు. ఫీడ్ పరిశ్రమల నుంచి టన్నుకు రూ.5 వేలు వసూళ్లు మొదలు పెట్టారని, అందుకే ఫీడ్ రేటు తగ్గడం లేదని విమర్శించారు.

హోదాపై వినతిపత్రం ఇచ్చే దమ్ము ఉందా?: చినబాబు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని కనీసం వినతిపత్రం ఇచ్చే దమ్ము ఉండా అని సిఎం వైఎస్ జగన్‌ను తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలపై కేంద్రాన్ని ఎందుకు నిలదీయటం లేదని ప్రశ్నించారు. మూడున్నరేళ్లల్లో కేంద్రం నుంచి సాధించేంటని నిలదీశారు. తన స్వార్థం కోసం యువత భవిష్యత్‌ను బలిపెడతారా అని మండిపడ్డారు.

జె ట్యాక్స్ ఢిల్లీకి తరలిస్తున్న జగన్ : రమణారెడ్డి

రాష్ట్రంలో అడ్డగోలుగా వసూలు చేస్తున్న జే ట్యాక్స్ సొమ్మును ఢిల్లీకి తరలించే కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ వైఎస్ జగన్ అని టిడిపి అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అడ్డంగా దొరికిన ట్రైడెంట్ ఛాంపర్, శ్రీ అవంతిక కన్‌స్ట్రక్షన్స్ రెండింటికీ సంబంధం లేదని చెబుతారా అని ప్రశ్నించారు. ట్రైడెంట్ ద్వారా క్విడ్ ప్రోకోలో రూ.70కోట్లు జగన్‌కు చెందిన జగతి పబ్లికేషన్స్‌లో పెట్టుబడులుగా పెట్టారని ఆరోపించారు.

టిడిపి కార్యాలయంలో మౌలానా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు


దేశంలో విద్యారంగంలో సంస్కరణలకు ఆద్యుడైన మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు టిడిపి కార్యాలయంలో శుక్రవారం జరిగాయి. కలాం చిత్రపటానికి పూలమాల వేసి నేతలు నివాళులర్పించారు. కలాం సేవలను ఎమ్మెల్సీ అశోక్ బాబు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎన్ఆర్ఐ విభాగం కోఆర్డినేటర్ సిహెచ్ రాజశేఖర్, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో దళితుడు మృతి

- హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ

ప్రజాశక్తి - రామచంద్రపురం (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

అనుమానాస్పదస్థితిలో దళితుడు మృతి చెందిన సంఘటన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్రాక్షారామం పంచాయతీ పరిధిలోని మండలమ్మపేటకు చెందిన వడ్డపాటి సత్యనారాయణ(55) ద్రాక్షారామానికి చెందిన భూస్వామి చలువాది జగదీష్ వద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. జగదీష్ రెండు హత్య కేసుల్లో నిందితునిగా ఉన్నాడు. ఒక కేసులో జైలుశిక్ష అనుభవించి ఇటీవలే బయటకు వచ్చాడు. పని సరిగా చేయడంలేదని యజమాని తనను కొడుతున్నట్టు సత్యనారాయణ పలుమార్లు కుటుంబ సభ్యుల వద్ద వాపోయాడు. శుక్రవారం ఉదయం యథావిధిగా జగదీష్‌కు చెందిన పొలంలోకి పనికి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో పొలంలో సత్యనారాయణ మతి చెందాడని అతని కుటుంబ సభ్యులకు జగదీష్ ఫోన్ చేసి తెలిపాడు. కుటుంబ సభ్యులు ఘటనా ప్రాంతానికి వెళ్లగా మట్టిలో కూరుకుపోయి ఉన్న సత్యనారాయణ మృత దేహాన్ని చూసి బోరున విలపించారు. సత్యనారాయణకు భార్య, కుమారు డు, కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఇన్‌ఛార్జి ఎస్ఐ ఆచార్యులు పరిశీలించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పొలం యజమాని జగదీషే తన తండ్రిని చంపాడని సత్యనారాయణ కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



సత్యనారాయణ(ఫైల్)

Government of India

Azadi Ka Amrit Mahotsav

ఆంధ్ర ప్రదేశ్‌కు రూ. 10,700 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టుల బహుమతి



శ్రీ నరేంద్ర మోది

ప్రధాన మంత్రి

ద్వారా

శంకుస్థాపన మరియు 7 అభివృద్ధి ప్రాజెక్టులు జాతికి అంకితం

శంకుస్థాపన చేయబడుతున్న ప్రాజెక్టులు

శ్రీకాకుళం - అంగుల్ నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ (745 కిమీ) (రూ. 2658 కోట్లు)

ఎన్‌హెచ్-130సిడి యొక్క రాయ్‌పూర్ - విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్‌లో 6-లేన్ల గ్రీన్ ఫీల్డ్ (రూ. 3778 కోట్లు)

విశాఖపట్నంలోని ఎన్‌హెచ్-516సి పైన కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలా నగర్ జంక్షన్ వరకు 6 లేన్ల రోడ్డు మెరుగుపరచడం మరియు విశాఖపట్నం పోర్ట్ కనెక్టివిటీ కోసం అదనంగా 4 లేన్ల డెడికేటెడ్ పోర్ట్ రోడ్డు (రూ. 566 కోట్లు)

విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ మరియు అభివృద్ధి చేయడం (రూ. 152 కోట్లు)

విశాఖపట్నం రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి (రూ. 460 కోట్లు)

జాతికి అంకితమిచ్చే ప్రాజెక్టులు

కృష్ణా గోదావరి డీప్ వాటర్ బ్లాక్‌లో ఒఎన్‌జిసి-యు-ఫీల్డ్ ఆన్‌షోర్ సదుపాయాలు (రూ. 2917 కోట్లు)

ఎన్‌హెచ్-326ఎ యొక్క నరసన్నపేట నుండి పాతపట్నం వరకు పునరావాసం మరియు అభివృద్ధి, శ్రీకాకుళం-గజపతి కారిడార్‌లో పవెడ్ షోల్డర్‌తో 2 లేన్లకు విస్తరించడం (రూ. 211 కోట్లు)

ఈ ప్రాజెక్టుల యొక్క ప్రయోజనం

- పైప్‌లైన్ నెట్‌వర్క్ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ మరియు ఒడిషాలు పరిశుభ్రమైన గ్యాస్‌ను సరఫరా చేయడంలో స్వయం సమృద్ధి సాధిస్తాయి మరియు తమ హరిత శక్తి అవసరాలను నెరవేరుస్తాయి
- జాతీయరహదారుల అభివృద్ధి తత్సంబంధిత ప్రాంతంలో సామాజిక, ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు ట్రాఫిక్‌ను కూడా సాఫీ చేస్తుంది
- ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి మరియు ఆధునీకరణలు, మత్స్యకారులకు మరియు చేపల వ్యాపారాలకు ఆర్థిక సుసంపన్నతను తెస్తాయి
- డీప్ వాటర్ బ్లాక్‌లో కనుగొన్న గ్యాసు విలువ శక్తి భద్రతను పెంచుతుంది
- శక్తివంతమైన రహదారి నెట్ వర్క్ ద్వారా స్థానిక ఉత్పత్తులు మరింత వ్యాపారాన్ని సృష్టించడం మరియు స్థానిక యువత కోసం కొత్త ఉపాధి అవకాశాలు ఏర్పాటు
- విశాఖపట్నం రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి చేయడం ద్వారా ప్రయాణికులకు ప్రపంచ స్థాయికి చెందిన సదుపాయాలు

ఈ ప్రముఖుల సమక్షంలో

శ్రీ బిశ్వభూషణ్ హరిచందన్
గవర్నర్, ఆంధ్ర ప్రదేశ్

శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
ముఖ్యమంత్రి, ఆంధ్ర ప్రదేశ్

శ్రీ అశ్విని వైష్ణవ్
కేంద్ర రైల్వేలు, కమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి

శ్రీ ఎం.వి.వి. సత్యనారాయణ
పార్లమెంట్ సభ్యులు (లోక్ సభ), విశాఖపట్నం

శ్రీ జి.వి.ఎల్. నరసింహారావు
పార్లమెంట్ సభ్యులు (రాజ్య సభ)

శ్రీ సి.ఎం. రమేష్
పార్లమెంట్ సభ్యులు (రాజ్య సభ)

శ్రీ వాకాటి నారాయణ రెడ్డి
శాసన మండలి సభ్యులు

శ్రీ పి.వి.ఎన్. మాధవ్
శాసన మండలి సభ్యులు

(డిడి న్యూస్‌లో లైవ్ ప్రసారం చూడండి)

శనివారం, 12 నవంబరు, 2022 న ఉదయం 10:15 గం.లకు.
యూనివర్సిటీ గ్రౌండ్, విశాఖపట్నం, ఆంధ్ర ప్రదేశ్



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68